



వైసీపీ నాయకుల తాట తీస్తా : జగ్గంపేట సభలో ఆవేశంగా మాట్లాడుతున్న పవన్



ఓటర్లూ గుర్తుపెట్టుకోండి : ప్రత్తిపాడులో పవన్‌తో కలిసి గాజు గ్లాసు, సైకిల్ గుర్తులు చూపుతున్న ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థిని సత్యప్రభ

నేను ఇక్కడే ఉన్నా : కిర్లంపూడి సభలో జనానికి వంగి అభివాదం చేస్తున్న పవన్ కల్యాణ్

అండగా నేనుంటా..

ప్రత్తిపాడు, కిర్లంపూడి వారాహి యాత్రలో పవన్‌కల్యాణ్

- మైనింగ్ మాఫియా ఆట కట్టిస్తా
- నాకు అన్ని కులాలు సమానమే
- సమస్యల పరిష్కారంపైనే దృష్టి
- ప్రతి చేతికి పని.. ప్రతి చేనుకు నీరే లక్ష్యం



మీ ఓటు జ్యోతిలా వెలగాలి : కిర్లంపూడి సభలో పవన్ పక్కన నిలబడి మాట్లాడుతున్న జ్యోతుల నెహ్రూ.. చిత్రంలో ఉదయ్‌శ్రీనివాస్, నవీన్ తదితరులు



అన్నొచ్చాడు : జగ్గంపేట రోడ్ షోలో పవన్‌కు జైకొడుతున్న అభిమానులు



జయహో పవన్ : ప్రత్తిపాడు రోడ్ షోలో అభిమానుల ఉత్సాహం

ఏలేశ్వరం/ జగ్గంపేట/ జగ్గంపేట రూరల్/ కిర్లంపూడి, ఏప్రిల్ 28 : మైనింగ్‌ను అక్రమంగా దోచేందుకే ప్రత్తిపాడు నియోజకవర్గంపై వైసీపీ నాయకులు కన్నువేశారని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరంలో ఆదివారం నిర్వహించిన జనసేన బహిరంగ సభలో పవన్ మాట్లాడారు. ప్రత్తిపాడు మండలంలో లేటరైట్ పేరుతో బాక్సైట్‌నూ తరలించుకుపోతున్నారన్నారు. మాఫియా డాన్ కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి తమ్ముడు లంపకలోవలో ఉన్న వీరభద్ర కంపెనీకి అనువుగా రోడ్డు, బ్రిడ్జి నిర్మించుకున్నారుకానీ నియోజకవర్గంలో ఉన్న రోడ్లను, ప్రజల సమస్యలను నిర్లక్ష్యంగా వదిలేశారన్నారు. ఏలేరు ప్రాజెక్టు, సుబ్బారెడ్డిసాగర్, చంద్రబాబు సాగర్‌లను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే వంతాడ అక్రమ మైనింగ్ ఆపుతానన్నారు. పెద్దమల్లాపురం కేంద్రంగా ప్రత్యేక మండలాన్ని ఏర్పాటుచేసి గిరిజనులకు మేలు చేస్తానన్నారు. 72 ఎయిడెడ్ స్కూల్స్, కళాశాలలను తీసేసిన ఘనత జగన్ ప్రభుత్వానిదేనన్నారు. ఎయిడెడ్ పాఠశాలలను కూటమి ప్రభుత్వంలో పునరుద్ధరిస్తామన్నారు. కాకినాడ జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో ప్రజలకు అండగా ఉంటానన్నారు. దళితుడైన డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హత్యచేసి డోర్ డెలివరీ చేసిన అనంతబాబుకు సీఎం ప్రాధాన్యం ఇవ్వడం పలు అనుమానాలను రేకెత్తిస్తోందన్నారు. జగన్ పార్టీ తరపున ఎంపీ అభ్యర్థిగా ఉన్న చలమలశెట్టి సునీల్‌ను ఓటర్లు నిలదీయాలన్నారు. కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి నీడను కూడా ప్రత్తిపాడుపై పడనీయబోయనని స్పష్టంచేశారు. కూటమి అధికారంలోకి వస్తే ప్రతి కార్పొరేషన్‌కు పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తామన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా వరుపుల సత్యప్రభ, గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను గెలిపించాలన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ మాట్లాడుతూ నిత్యపోరాటయోధుడు పవన్‌కల్యాణ్ నీతికి నిలబడే వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మీసాల రాజు, గాటా బాలుదొర, బాబీ తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట అభివృద్ధికి కృషి

ప్రతి చేతికి పని, ప్రతి చేనుకు నీరందించడమే ముఖ్య లక్ష్యమని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. జగ్గంపేట నియోజకవర్గ సమస్యలపై కిర్లంపూడిలో నిర్వహించిన వారాహి సభలో పవన్ మాట్లాడారు. 'మల్లవరం ప్రాజెక్టుకు రూ.132 కోట్లు అంచనా వేసి రెండుసార్లు శంకుస్థాపన చేసి కూడా ప్రభుత్వం నిధులు ఇవ్వలేదన్నారు. పుష్కర ఎత్తిపోతల పథకం నిర్వీర్యమైపోయిందన్నారు. పోలవరం మట్టి గట్లను తవ్వేస్తున్నా జలవనరులశాఖ చోద్యం చూస్తుందని మండిపడ్డారు. కిర్లంపూడి మండలం బూరుగుపూడి 175 ఎకరాల దుస్లాం చెరువును వైసీపీ ప్రతినిధులు ఆక్రమించేశారని తెలిపారు. గోకవరంలో పంచాయతీ స్థలాల్లో లాడ్జిలు నిర్మించారన్నారు. వైసీపీ శ్రేణులు రామేశ్వరంమెట్ట మట్టి తరలించుకుపోయి కోట్లాది రూపాయలు వెనకేసుకున్నారన్నారు. పుష్కర ఎత్తిపోతల పథకం నీరురాక 30 వేల ఎకరాలు ఎండితున్నా కనీస స్పందన లేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక కిర్లంపూడికి డిగ్రీ కాలేజీ తెస్తాం. ఏలేరు ఆధునికీకరణ చేస్తాం. మల్లవరం సాగునీటి ప్రాజెక్టు పూర్తిచేస్తాం' అని స్పష్టంచేశారు. జగన్ గత ఎన్నికల్లో కాపులకు రిజర్వేషన్ ఇవ్వలేనని చేతులెత్తేశారని, అప్పుడు జగన్‌ను అడగలేకపోయారని, ఈ డబ్ల్యూసీ పథకం కింద టీడీపీ ఐదు శాతం ఇస్తే దాన్ని వైసీపీ తుంగలోకి తొక్కిందన్నారు. ఇక్కడ ఉద్యమ నాయకులు సినిమాల్లో రంగులేసుకునే వారని హేళన చేస్తున్నారు తప్పితే కాపులకు మంచి చేస్తే ఆనందపడేవాడినన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని కులాలకు సమన్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.



పవన్‌కు పూలమాల వేస్తున్న నాయకులు



ప్రత్తిపాడు సభకు హాజరైన జనం

కూటమి ప్రభుత్వం రాగానే సమస్యలు పరిష్కరిస్తా

కాకినాడ ఎంపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

జనసేన పార్టీ అంటే జెండా కాదు.. అజెండా ఉన్న పార్టీ. ప్రత్తిపాడు నియోజకవర్గంలో మైనింగ్, రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటి సమస్య అధికంగా ఉంది. కాకినాడ పోర్టు అభివృద్ధి చేయరు, రైల్వే జోన్ పట్టించుకోరు. సెజ్ భూములను చిత్తశుద్ధితో పట్టించుకుని పరిశ్రమలు తీసుకొస్తే ఆరు లక్షల మందికి ఉద్యోగం కల్పించవచ్చు. సెజ్ భూములను రియల్ ఎస్టేట్‌లా వాడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలను నెరవేరుస్తాను.

యువత భవిష్యత్ కోసమే పవన్ ఆరాటం..

ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సత్యప్రభ

రాష్ట్రం కోసం, రాష్ట్రంలో ఉన్న యువత భవిష్యత్ కోసం అండగా నిలబడి కూటమి గెలుపు కోసం పవన్‌కల్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారు. నా భర్త రాజా మరణం అనంతరం అండగా నిలిచి ధైర్యం చెప్పిన చంద్రబాబు రుణం తీర్చుకోలేనిది. కూటమి అభ్యర్థిగా నన్ను గెలిపించడానికి నాకు మద్దతు ఇచ్చిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో సుబ్బారెడ్డిసాగర్, చంద్రబాబు సాగర్ ఆధునికీకరణ పనులు జరగక రైతులకు నీరు అందడం లేదు. అధికారంలోకి రాగానే సమస్యల్నీ పరిష్కరిస్తాం.

త్యాగశీలి పవన్‌కల్యాణ్

జగ్గంపేట అభ్యర్థి జ్యోతుల నెహ్రూ

విజన్ ఉన్న చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారనే నమ్మకంతో ఉమ్మడిగా ఆయన్ను సీఎం చేయడానికి మూడు పార్టీల మద్దతు ఉంది. తనకున్న బలాన్ని తగ్గించుకున్న వ్యక్తి పవన్‌కల్యాణ్. సంక్షేమం, అభివృద్ధి అందించడం కోసం ఒక త్యాగశీలిగా నిలిచారు. పవన్‌కల్యాణ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలి. నియోజకవర్గ అభివృద్ధికి ఎన్నో ప్రాజెక్టులు తీసుకువచ్చి వ్యవసాయంతో పాటు నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తాను. పొలాలకు సాగునీటి కొరత లేకుండా చేసి సస్యశ్యామలం చేస్తా.



ఇంటర్వ్యూ

గ్రేటర్ రాజమహేంద్రి

- అదే లక్ష్యం.. ఆమేరకు అభివృద్ధి
- చారిత్రక ఔన్నత్యాన్ని కాపాడతా
- రాజమండ్రి సిటీ కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

నేడు అభ్యర్థుల తుది జాబితా

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి అర్హత సాధించిన అభ్యర్థుల తుది జాబితా ఎన్నికల అధికారులు సోమవారం సాయంత్రం 3గంటల తర్వాత ప్రకటిస్తారని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డా. కె.మాధవీలత ఆదివారం తెలిపారు.శుక్రవారం మొత్తం 89 మంది నామినేషన్లు ఆమోదించారు. నామినేషన్లు ఉపసంహరించుకోవడానికి సోమవారం మధ్యాహ్నం 3 గంటల వరకూ గడువు ఉంది. అనంతరం జాబితా ప్రకటిస్తారు. ప్రధాన పార్టీలకు గుర్తులు ఉంటాయి. స్వతంత్రులు,ఇతరులకు గుర్తుల కేటాయిస్తారు.

నాయకులు రాక

అంబాజీపేటలో నేడు జగన్ సభ

నేడు, రేపు పవన్ రోడ్‌షో

నేడు, రేపు షర్మిల టూర్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎన్నికల ప్రచార జోరు ఊపందుకుంది. సోమ, మంగళవారాల్లో పవన్ తన సొంత నియోజకవర్గమైన పిఠాపురంలో రోడ్‌షో నిర్వహిస్తారు. సోమవారం మధ్యాహ్నం సీఎం జగన్ అంబాజీపేటలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. సోమవారం కాకినాడ, రాజమహేంద్రవరంలలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పర్యటించి ఎన్నికల సభల్లోను, మంగళవారం అంబాజీపేటలోను పాల్గొంటారు.



డిగ్రీలు చదువుకుని.. పొట్ట చేతపట్టుకుని..!

నిరుద్యోగుల జీవితాలతో ఐదేళ్లూ జగన్ ఆటలు

- జాబ్ క్యాలెండర్‌పై మాట తప్పారు
- విడుదలకాని నోటిఫికేషన్లు
- ఐదేళ్లూ సర్కారీ కొలువుల్లేవ్
- మెగా డీఎస్సీ పేరుతో వంచన
- పరిశ్రమలు పడక..75 శాతం ఉద్యోగాల్లేవ్
- వలంటీర్ 'సేవ'ను ఉద్యోగాలుగా బడాయి
- ఇంజనీరింగ్ చదివి ఇంట్లోనే కాలక్షేపం
- వైసీపీ పాలనలో యువతకు దగా
- 20 లక్షల ఉద్యోగాలంటూ కూటమి వరం

'డిగ్రీలు పుచ్చుకొని.. పొట్ట చేతపట్టుకుని' ఈ మాటలు ఎక్కడో విన్నట్టు ఉన్నాయి కదూ.. ఆకలిరాజ్యం సినిమాలోని సూపర్‌హిట్ పాటలో ఒక లైన్ ఇది.. ఈ ఐదేళ్లు జగన్ ప్రభుత్వం ఈ మాటను నిజం చేసింది.. యువతకు ఉద్యోగాల్లేవ్.. చిన్నా చితక ఉద్యోగాలు తప్ప చదువుకు తగిన ఉద్యోగాల ఊసేలేదు.. జగన్ ప్రభుత్వంలో యువత దగా పడ్డారు. జాబ్ క్యాలెండర్ అంటూ గత ఎన్నికల సందర్భంగా జగన్ డాబు కబుర్లు చెప్పారు. వాటిని నమ్మిన యువత నోటిఫికేషన్లకు ఎదురు చూపులతోనే ఐదేళ్లు ఆవిరైపోయాయి. వారి వయసుకు ఐదేళ్లు జమయిపోయింది.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో యువత ఆశలు నీరుగారిపోగా.. నిరుద్యోగం కోరలు చాచింది. డిగ్రీలు చదివి ఇంట్లో ఉండిపోయిన పిల్లలను చూస్తూ తల్లిదండ్రులు ఆవేదనకు గురయ్యారు. జగన్ సీఎం పీఠమెక్కిన తర్వాత సర్కారీ కొలువులకు ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదు. వలంటీర్ల 'సేవ'ను ఉద్యోగాల జాబితాలో కలిపేసుకుని లక్షల ఉద్యోగాలు ఇచ్చామంటూ ఐదేళ్లు కాలక్షేపం చేసేశారు. జాబ్ మేళాలంటూ యువతను వంచన చేశారు. మెగా డీఎస్సీ పేరుతో 'గాలి' ప్రకటన తెరపైకి తెచ్చి యువతను మరింత మనోవేదనలో ముంచేశారు. ఐదేళ్ల పాటు యువతను వేధించిన సీఎంగా జగన్ మరో ఘనత సాధించారు.కూటమి 20 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పడంతో యువతలో నూతనోత్సాహం కనిపిస్తోంది.గత చంద్రబాబు హయాంలో పెద్ద సంఖ్యలో ఉపాధి పొందిన చరిత్రను ఉద్యోగార్థులు గుర్తు చేసుకుంటున్నారు.

మెగా డీఎస్సీ.. 390 ఉద్యోగాలు..

ఐదేళ్లుగా ఎప్పుడెప్పుడా అని యువత ఎదురు చూసిన డీఎస్సీ నోటిఫికేషన్ ఎన్నికల ఎత్తులో భాగంగా పరుగు పరుగున వచ్చేసి మెగా పేరుతో భావి ఉపాధ్యాయులను దగా చేసింది. ఖాళీలు బ్లాక్ బోర్డంత ఉండగా భర్తీల సంఖ్య మాత్రం చాక్‌పీసంత కూడా లేదు. ఎన్నికల వేళ ఓ నోటిఫికేషన్‌ను హడావుడిగా తెరపైకి తీసుకొచ్చి యువతను మోసం చేశారు. గత ఎన్నికల ముందు ఓట్ల కోసం మెగా డీఎస్సీ అని ఊదరగొట్టిన జగన్‌కి మళ్లీ ఎన్నికల సమయానికి గానీ ఉద్యోగార్థుల ఆవేదన వినిపించలేదు. ఉమ్మడి తూర్పుగోదావరిని పరిగణనలోకి తీసుకొని డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో సుమారు 2 వేలపైనే ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఉన్నాయి.జగన్ ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరుతో కేవలం 390 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎన్నికల షెడ్యూల్‌కి నెలముందు ప్రభుత్వం డీఎస్సీని ప్రకటించింది. ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 20 రోజులు సమయం ఇచ్చి తర్వాత 10 రోజులకే డీఎస్సీ అన్నారు.అంత తక్కువ సమయంలో అభ్యర్థులు రెండింటికీ ఎలా సన్నద్ధమవుతారని పాలకులు ఆలోచించలేదు. ఒక పక్క పోస్టులు తక్కువగా ఉండడం..మరో పక్క పరీక్షల షెడ్యూల్‌తో ఉద్యోగార్థులను జగన్ టార్చర్ పెట్టారనడంలో సందేహం లేదు. కొందరు అభ్యర్థులు తమ ఆవేదన చెబుతూ సోషల్ మీడియాలో పోస్టులు కంటనీరు పెట్టించాయి.

జగన్ మార్కు మెలిక

డీఎస్సీ నోటిఫికేషన్‌లోనూ జగన్ మార్కు మెలిక తప్పలేదు. కీలకమైన సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) పోస్టులకు బీఈడీ అభ్యర్థులను అర్హులుగా ప్రకటించి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రక్రియ జాప్యం చేయాలనే పన్నాగం పన్నింది. ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులు అనర్హులని గతంలో సుప్రీంకోర్టు చెప్పింది. జగన్ ప్రభుత్వం ఎస్జీటీ పోస్టులకు బీఈడీ వాళ్లను అర్హులుగా ప్రకటిస్తూ నోటిఫికేషన్ ఇచ్చేసింది. హైకోర్టు మొట్టికాయలతో ఎస్జీటీ పోస్టులకు డీఎడ్ వారిని మాత్రమే అనుమతిస్తామని తెలిపింది.దాంతో ఎస్జీటీ పోస్టుల దరఖాస్తుదారుల పరిస్థితి అయోమయంలో పడింది.

ఉన్నత చదువులు..చిన్న ఉద్యోగమా?

సచివాలయ ఉద్యోగాల పేరుతోను యువతను జగన్ సర్కారు మోసం చేసింది.. ప్రభుత్వ ఉద్యోగమంటూ ప్రచారం చేసింది..పెద్ద పెద్ద చదువులు చదివిని యువత తమ ఉద్యోగాలు మానివేసి సచివాలయ ఉద్యోగాల బాటపట్టారు. ఇప్పుడు ఉండలేక..వచ్చేది సరిపోక..బయటకు వెళ్లలేక సతమతమవుతున్నారు.చంద్రబాబు వస్తే తమకు మంచి దారి చూపుతారని ఎదురుచూస్తున్నారు. వలంటీర్ల వ్యవస్థతో మరి కొంత మంది యువత ఆటలాడుకున్నారు.ఏదో చిన్న ఉద్యోగం ఇచ్చి గ్రామాలకే కట్టిపడేశారు. వలంటీర్లు చేసేది సేవ అని జగన్ పలుమార్లు అన్నారు. యువత జీవితంలో ఐదేళ్లూ ఎంత విలువైనదో సీఎం సారుకు తెలియదా పాపం.. కేవలం రూ.5వేలు గౌరవభృతి మాత్రమే ఇచ్చి రాజకీయ అవసరాలకు ఉపయోగించుకోడానికి వలంటీరు వ్యవస్థను తెరపైకి తెచ్చారు.వారితో 'అన్ని' పనులూ చేయించుకున్నారు. చివరికి వారిని అడకత్తెరలో వలంటీరు మాదిరిగా చేసేశారు. ఎన్నికలు వచ్చేసరికి తీసి పక్కన పెట్టేశారు.ఇలా లక్షలాది ఉద్యోగాలు కల్పించామంటూ అంకెల గారడీతో నాలిక మడత పెట్టేశారు జగన్.

చంద్రబాబు వస్తే ఐటీ వస్తోంది..!



నేడు మనం చూస్తున్న హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ చంద్రబాబు విజన్‌కి ప్రతిరూపం. వేలాది మంది ఐటీ చదివిన పిల్లల కలల సాకారానికి నిదర్శనం. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజా వేదికతో మొదలు పెట్టిన విధ్వంసం అమరావతి వరకూ నిరంతరాయంగా కొనసాగింది. 2019లో చంద్రబాబు సీఎం అయి ఉంటే రాష్ట్రానికి చెందిన ఐటీ పిల్లలు వేరే రాష్ట్రాలకు కేవలం రూ.10వేల జీతానికి వలస వెళ్లాల్సిన పరిస్థితి దాపురించేది కాదు. మనకు దగ్గరలోని అమరావతిలో ఉద్యోగం చేసుకునేవాళ్లు. విభజిత రాష్ట్రంలో జగన్ ఐటీ పిల్లల ఉపాధికి ఒక్క ప్రయత్నమూ చేయలేదు. ఏపీలో ఐటీ కొలువు కలగానే మిగిలిపోయింది. దీంతో బెంగళూరు, మద్రాసు, హైదరాబాద్‌కి పిల్లలు వలస వెళ్లక తప్పడం లేదు. ఇప్పుడు మళ్లీ ఐటీ హబ్ అంటూ జగన్ ఊదరగొడుతున్నారు.చంద్రబాబును రాజమండ్రి సెంట్రల్ జైలులో బంధించిన సమయంలో ఐటీ ఉద్యోగులు బారీగా వచ్చారు.వాళ్లనూ వైసీపీ ప్రభుత్వం నిస్సిగ్గుగా అడ్డుకొంది.మలేషియాలో ఐటీ ఉద్యోగం చేస్తున్న ఓ ఉద్యోగి రూ.2లక్షలు ఖర్చు పెట్టుకొని చంద్రబాబును చూడాలని ఆనాడు రాజమండ్రి వచ్చారు.ఇదొక్క ఘటన చాలు చంద్రబాబు విజన్ గురించి చెప్పడానికి. మళ్లీ చంద్ర బాబు వస్తే అమరావతిలో హైటెక్ సిటీ వస్తుందని యువత భరోసాగా ఉండడమే ఆ నమ్మకానికి నిదర్శనంగా నిలుస్తోంది.

స్థానికులకు 75 శాతం ఉద్యోగాలేవి..

జగన్ ప్రభుత్వం వచ్చాక మద్యం పరిశ్రమలను బలవంతంగా వైసీపీ నాయకులు చెరబట్టి వ్యాపారం చేస్తున్నారు. అవి తప్ప కొత్తగా పరిశ్రమలు వచ్చిన దాఖలాలు లేవు. ఐదేళ్లలో యువతకు ఉపాధి కల్పించే విధంగా ఒక్క పరిశ్రమ ఉత్పత్తి ప్రారంభించలేదు. వైసీపీ ప్రభుత్వ విధానాలతో చాలా పరిశ్రమలు పడకేశాయి. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే చూస్తే సుమారు 10 పరిశ్రమల వరకూ మూతపడ్డాయి. విజ్జేశ్వరం పవర్ ప్లాంట్, వేమగిరిలో జీవీకే, బిక్కవోలు మండలం కొనేడులో బ్లూక్రాఫ్ట్ ఆగ్రో ఇండస్ట్రీస్,జీడిపప్పు, సగ్గుబియ్యం పరిశ్రమలు సైతం మూతపడ్డాయి. కాకినాడ, కోనసీమ జిల్లాలో మరిన్ని పరిశ్రమలు సైతం లాకౌట్‌కు గురయ్యాయి.దీంతో సుమారు 50 వేల మంది ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డారు. ఉమ్మడి తూర్పు లో మూడు నాలుగు పరిశ్రమలకు కొబ్బరికాయలు కొట్టినా అంతకుమించి ఒక్క అడుగూ ముందుకు పడలేదు. రాజానగరం నియోజకవర్గం పరిధిలో ఎన్నికల షెడ్యూల్‌కి ఒక్క రోజు ముందు హడావుడిగా పారిశ్రామికవాడకు శంకుస్థాపన చేశారు.ఈ ఐదేళ్లలో గుర్తుకురాని పరిశ్రమలు, యువతకు ఉపాధి పాలన చివరలో జగన్‌కి ఠక్కున గుర్తొచ్చేశాయి.ఏడాదికి వేలాది మంది ఇంజనీరింగ్, బీఎస్సీ, బీఏ, బీబీఎం, బీకాం వంటి డిగ్రీలు పూర్తి చేసి కళాశాలల నుంచి బయటకు వస్తున్నారు. ఐదేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేక ఇంట్లో కాలక్షేపం చేయక తప్పలేదు.గత ఎన్నికల్లో భాగంగా స్థానిక పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే అనే జగన్ హామీని అటకెక్కించారు. అటు ఉద్యోగాల కల్పన లేక,ఇటు పరిశ్రమలు మూతపడడంతో యువత అల్లాడిపోయారు. కొందరు సెల్ ఫోను షాపులు, షాపింగ్ మాల్స్, ఆటోమొబైల్ తదితర దుకాణాల్లో అతి తక్కువ జీతానికి విధిలేక పనిచేస్తున్నారు.

కూటమితో ఊతం

గత ఎన్నికల్లో జగన్ ఇచ్చిన హామీలు 'గాలి' మాటలు కావడంతో పెద్ద సంఖ్యలో యువత కుదేలయ్యారు. నోటిఫికేషన్లకు ఎదురు చూడడంతోనే ఐదేళ్లు గడచిపోయాయి. ఇక జగన్ మాటలు నమ్మే స్థితిలో యువత లేదు. ఇప్పుడు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామంటూ భరోసా ఇవ్వడంతో యువతలో మళ్లీ నూతనోత్సాహం కనిపిస్తోంది. చంద్రబాబు హయాంలో పెద్ద సంఖ్యలో వచ్చిన ఉద్యోగాలను వారు గుర్తు చేసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నైపుణ్య శిక్షణ పడకేసింది. నోటిఫికేషను ముఖం చాటేసింది. విదేశాల్లో ఉపాధి ఊసే మరిచిపోయారు.

జన కేతనం
ఆంధ్రజ్యోతి
పిగన్నవరం/ రావులపాలెం/ ఆత్రేయపురం/ మండపేట/గండేపల్లి
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా
సోమవారం 29 ఏప్రిల్ 2024 6

నిరుద్యోగుల ఆవేదన..ఆక్రందన

ఈ ఐదేళ్ల వైసీపీ పాలన.. యువత జీవితాలతో ఆటలాడింది. గత ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలుచేయలేదు. వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని నియమించి.. ఇవే ఉద్యోగాలంటూ మభ్యపెట్టే ప్రయత్నం చేసింది. ఐదేళ్లపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా పోవడం అంటే వారి జీవితంలో యువత ఎదిగే క్రమం ఆగిపోయినట్టే. కాలాన్ని తిరిగి తేలేనట్టే.. వారి భవిష్యత్తునూ తీరని అన్యాయం జరిగినట్టే. వారి మాటల్లోనే

డిగ్రీ చదివి ఫ్రూట్స్ అమ్ముతున్నా



ఒక్క చాన్స్ అంటూ అధికారం చేపట్టిన సీఎం జగన్ ఈ ఐదేళ్లలో ఉద్యోగాలు కల్పించలేదు. ప్రైవేటు ఉద్యోగం చేసుకుందామన్నా పరిశ్రమలు తీసుకురాలేదు. దీంతో చాలామంది యువత రోడ్ల మీద తిరుగుతున్నారు. టీడీపీ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలు ఇప్పుడు కరువయ్యాయి. ఉద్యోగం లేక ఫ్రూట్స్ అమ్ముకుంటున్నా. చింతల స్వామి, మల్లేపల్లి, గండేపల్లి మండలం

చివరికి నిరాశే మిగిలింది..



అధికారంలోకి వస్తే ప్రతి ఏడాది మెగా డీఎస్సీలు నిర్వహించి నిరుద్యోగుల సమస్యను పరిష్కరిస్తానని ఆనాటి పాదయాత్రలో చెప్పిన సీఎం జగన్ ఐదేళ్ల కాలంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదు. ఎంతగానో ఎదురుచూసిన నిరుద్యోగుల ఆశలు నిరాశగానే మిగిలిపోయాయి. కుటుంబ సభ్యులకు దూరంగా ఉండి ఏళ్ల తరబడి కోచింగ్ తీసుకున్నాం. కోచింగ్ సెంటర్లలో కోచింగ్ నిమిత్తం లక్షలాది రూపాయలు హెచ్చించాం. తీరా చూస్తే జగన్ ప్రభుత్వం బీఈడీ అభ్యర్థులకు మొండిచెయ్యి చూపింది. ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించాలన్న నా కల జగన్ ప్రభుత్వంలో నెరవేరలేదు. చాలా బాధగా ఉంది. **– కుడిపూడి శ్యామలాదేవి, మానేపల్లి, పి.గన్నవరం మండలం**

డీఎస్సీ లేక నష్టపోయాం



2014లో ఎంఎస్సీ బీఈడీ పూర్తిచేసుకుని అప్పట్లో విడుదల చేసిన డీఎస్సీ పరీక్షలు రాశాం. కాకపోతే ఉత్తీర్ణత కాలేకపోయాం. 2019 నుంచి నేటి వరకూ డీఎస్సీపై స్పష్టతలేదు. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ పరీక్షలు రాశాం. వాటి ఫలితాలు విడుదల చేయ్యలేదు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలలో అలసత్వం కారణంగా బీఈడీ పూర్తిచేసికున్నప్పటికి ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. చదువుకుని కూడా ఉద్యోగం లేక ఖాళీగా ఉంటున్నాం. సకాలంలో ఉద్యోగాల భర్తీ జరగాలి.. **– డి.చైతన్య, రావులపాలెం**

20 లక్షల ఉద్యోగాలపైనే ఆశ



నాపేరు చందు.. గ్రాడ్యూషన్ చేశాను. ఇప్పటివరకు ఎటువంటి ఉద్యోగం రాలేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉద్యోగాల కల్పన జరగలేదు. కేవలం వలంటీర్లు, సచివాలయ ఉద్యోగాలు తప్ప ప్రభుత్వ ఉద్యోగాలేవీ లేవు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటివరకు రాజధాని లేకపోవడం, పరిశ్రమలు రాకపోవడంతో ఎంతో నష్టం జరిగింది. చదువున్న ఐటీ సెక్టార్‌లో ఉద్యోగాలు లేవు. దాంతో చదువుకున్నా ఇంటికే పరిమితం అవుతున్నాం. కూటమి ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పడంపైనే ఆశలు పెట్టుకున్నాం. వచ్చే ప్రభుత్వంలోనైనా మా కలలు సాకారం అవుతాయని ఆశిస్తున్నాం. **– చందు, అచ్యుతాపురం, కపిలేశ్వరపురం మండలం**

పక్క రాష్ట్రాలకు పట్టభద్రులు



జగన్ ఐదేళ్లలో ఐటీ రంగాన్ని పూర్తిగా విస్మరించారు. ఇంజనీరింగ్ పట్టభద్రులు, ఉపాధి కోసం పక్క రాష్ట్రాలకు పరుగులు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. కోటి ఆశలతో కష్టపడి ఇంజనీరింగ్ పూర్తిచేసుకున్న పట్టభద్రులకు రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు కనుమరగయ్యాయి. బీటెక్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఈఈఈ, మెకానిక్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన ఎంతోమంది పట్టభద్రులు మన రాష్ట్రంలో ఉపాధిలేక పక్క రాష్ట్రాలో విస్తరించిన కంపెనీల వైపు వెళ్లాల్సిన దుస్థితి రాష్ట్రంలో ఏర్పడడం దౌర్భాగ్యం. **కన్నా సాయిరాం, బీటెక్ విద్యార్థి, రాజవరం, ఆత్రేయపురం**



బీ ఫారం అంటే ఏమిటంటే..

సామర్లకోట, ఏప్రిల్ 28: ఏ ఫారం, బీ ఫారం అనే పదాలు ఎన్నికల సమయంలో తరచూ వింటుంటాం. గుర్తింపు పొందిన ప్రాంతీయ, జాతీయ పార్టీలు తమ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థులకు బీ ఫారం ఇస్తాయి. అంటే ఫలానా నియోజకవర్గం నుంచి తమ పార్టీ తరఫున పోటీచేసే అభ్యర్థి ఇతనే అని ఇచ్చే ధ్రువీకరణ పత్రమే ఇది. ఈ ఫారాన్ని పార్టీ అధ్యక్షుడు కానీ, ఆ పార్టీకి చెందిన ప్రత్యేక ప్రతినిధి కానీ జారీ చేస్తారు. నామినేషన్ వేసే సమయంలో రిటర్నింగ్ అధికారికి బీ ఫారం దాఖలు చేయాల్సి ఉంటుంది. ఇలా సమర్పించిన అభ్యర్థులకే ఎన్నికల కమిషన్ ఆ పార్టీ గుర్తును కేటాయిస్తుంది. లేకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తుంది. బీ ఫారం ఇచ్చే అధికారాన్ని అప్పగిస్తూ ఇచ్చేదే ఏ ఫారం. దీనిని తీసుకున్న వ్యక్తి అభ్యర్థులకు బీ ఫారం ఇచ్చే అధికారం ఉంటుంది.





ఇద్దరూ అయితాబత్తుల ఆనందరావులే

అయితాబత్తుల వారు ఐదుగురు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ స్థానానికి నామినేషన్ల పరిశీలన అనంతరం 18 మంది అభ్యర్థులు మిగిలారు. అందులో ఐదుగురు అయితాబత్తుల వారే ఉన్నారు. వారిలో ఇద్దరు అయితాబత్తుల ఆనందరావులు ఉండడం విశేషం. ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం గ్రామానికి చెందిన అయితాబత్తుల ఆనందరావు కూటమి తరఫున టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. అదే గ్రామానికి చెందిన అయితాబత్తుల అభిమన్యుడు జాతీయ జనసేన పార్టీ తరఫున పోటీపడుతున్నారు. కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంకకు చెందిన మరో అయితాబత్తుల ఆనందరావు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఇక నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున అల్లవరం మండలం దేవగుప్తం గ్రామానికి చెందిన అయితాబత్తుల ఆనందబాబు పోటీ పడుతున్నారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ తరఫున అయితాబత్తుల సుభాషిణి బరిలో నిలిచారు.



రెచ్చగొట్టే వ్యాఖ్యలతో జైలే

పెద్దాపురం, ఏప్రిల్ 28 : కొందరు అభ్యర్థులు సెంటిమెంట్‌ను రెచ్చగొడితేనో ఓట్లు పడతాయని భావించి కులం, వర్గం, ప్రాంతం పేరుతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. ఇటువంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలకు అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం నియమావళిలో కఠిన నిబంధనలు రూపొందించింది. ఎన్నికల్లో ఎవరైనా జాతి, మతం, కుల, భాష, సమాజం పేరుతో రెచ్చగొడితే ఆర్‌పీ చట్టం 1951 సెక్షన్ 125, ఐపీసీ సెక్షన్ 153ఏ ప్రకారం మూడేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తారు. ఓటు కోసం మద్యం, డబ్బులు, ఇతర వస్తువులను తీసుకున్నవారిని నేరస్థులుగానే పరిగణిస్తారు. ఐపీసీ సెక్షన్ 171బీ, 171ఈ, హెచ్ ప్రకారం లంచంగా పరిగణించి ఏడాది జైలు శిక్ష విధిస్తారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రవాహంపై నిఘా పెంచారు. నజరానాలకు లొంగినా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

రేపు షర్మిల రాక

అంబాజీపేట, ఏప్రిల్ 28: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి 30వ తేదీన అంబాజీపేట నాలుగురోడ్ల జంక్షన్‌లో నిర్వహించే సభలో పాల్గొంటారని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, లోక్‌సభ అభ్యర్థి జంగా గౌతమ్ తెలిపారు. అంబాజీపేటలో మండల కార్యదర్శి ఆదుర్తి నారాయణమూర్తి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గౌతమ్ మాట్లాడారు. రాష్ట్రంలో దళితులపై అనేక దాడులు జరిగాయని, అయినప్పటికి దళితులపై కపటప్రేమ ఉన్నట్లు నటిస్తూ దళిత ఓట్ల కోసం పాకులాడుతున్నారన్నారు. దళితుల శిరోముండనం కేసులో శిక్షపడిన తోట త్రిమూర్తులకు టిక్కెట్టు ఇచ్చి దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారన్నారు. సమావేశంలో కొండేటి వెంకటేశ్వరరావు, మహ్మద్ ఆరీఫ్, మాచవరపు శివన్నారాయణ, నెల్లి వెంకటరమణ, నాగవరపు నాగరాజు, నేతల నాగరాజు, ములపర్తి మోహనరావు, వాకపల్లి రాంబాబు, అంబటి శ్రీను, యార్లగడ్డ రవీంద్ర, సీపీఎం నాయకుడు పితాని ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

నాయకులొస్తున్నారు..

అంబాజీపేటలో నేడు జగన్ సభ


అంబాజీపేట, ఏప్రిల్ 28: అంబాజీపేట సెంటర్‌లో సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి బహిరంగ సభ జరగనుంది. దీంతో ఎస్పీ ఎస్.శ్రీధర్, అడిషనల్ ఎస్పీ ఖాదర్‌బాషా, పి.గన్నవరం వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. అంబాజీపేట హైస్కూల్‌లో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు డీఎస్పీ కె.వెంకటరమణ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, చెల్లబోయిన శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు విత్తనాల శేఖర్, జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్ తదితరులు ఉన్నారు.

నేడు, రేపు పవన్ రోడ్‌షో

పిఠాపురం, ఏప్రిల్ 28: పిఠాపురం నియోజకవర్గంలో సోమ, మంగళవారాల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ రోడ్‌షో నిర్వహించనున్నారని జనసేన పిఠాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ తెలిపారు. గొల్లప్రోలు మండలం చెందుర్తిలో సోమవారం ఉదయం 8 గంటలకు రోడ్‌షో ప్రారంభమై వన్నెపూడి, కొడవలి, వెల్దుర్తి, పి.దొంతమూరు, బి.కొత్తూరు, పి.తిమ్మాపురం, గోకివాడ, జములపల్లి, నరసింగపురం, ఎల్ఎస్‌పురం, కోలంక, విరవాడ, విరవ, మల్లాం, మంగితుర్తి, జల్లూరు, ఎఫ్‌కేపాలెం, కందరాడ గ్రామాల మీదుగా కుమారపురం వరకూ సాగుతుందని చెప్పారు. మంగళవారం ఉదయం 9 గంటలకు చిత్రాడలో ప్రారంభమై గొల్లప్రోలు పట్టణ వీధుల్లో రోడ్‌షో జరుగుతుందని తెలిపారు.

28 ఏళ్లు పూర్తయింది..

పెద్దాపురం, ఏప్రిల్ 28: ఓటు వేయడానికి ప్రధాన ఆయుధమైన ఓటరు గుర్తింపు కార్డు అమల్లోకి వచ్చి 28 ఏళ్లు పూర్తవుతోంది. ఎన్నికల్లో పారదర్శకత పెంచేందుకు భారత ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు సంస్కరణలు అమలు చేస్తూనే ఉంది. ఈ మేరకు 1995లో అప్పటి ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్ ఓటరు గుర్తింపు కార్డులు ప్రవేశపెట్టారు. ఇవి అమలులోకి వచ్చి 28 ఏళ్లు అవుతోంది. ఓటరు జాబితా ఆధారంగా పుట్టిన తేదీ, ఫోటో, చిరునామా, తదితర వివరాలతో ఎన్నికల కమిషన్ ఓటరు గుర్తింపు ముద్రిస్తుంది. ప్రతీ కార్డుపై హాలోగ్రామ్, స్టిక్కర్ ఉంటుంది. ఓటరు గుర్తింపు కార్డు ఆధారంగా ఓటు, పోలింగ్ బూత్ వివరాలు తెలుసుకోవచ్చు. ఓటరు గుర్తింపు కార్డు చూపించి ఓటు వేయవచ్చు. బ్యాంకు ఖాతాలు, రుణాలు, డ్రైవింగ్ లైసెన్సు, తదితర ఇతర అవసరాలకు కోసం గుర్తింపు కార్డుగా కూడా వినియోగించుకోవచ్చు.





నడింపల్లి రామభద్రరాజు



బొజ్జా అప్పలస్వామి




కుదుపూడి సూర్యనారాయణ



కుదుపూడి ప్రభాకరరావు



మెట్ల సత్యనారాయణ



కుదుపూడి చిట్టబ్బాయి



పినిపే విశ్వరూప్



కళా వెంకట్రావు



అయితాబత్తుల ఆనందరావు



అమలాపురం నియోజకవర్గం

సామాజికవర్గాల సమీకరణలతో జరిగే ఎన్నికల పోరులో కోనసీమ కేంద్రమైన అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్లు ఇచ్చే తీర్పు విలక్షణమైనది. ఆరు దశాబ్దాల కాలంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రెండు సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తుల ఏలుబడిలోనే నియోజకవర్గ పాలన సాగింది. రాజకీయాలతో హోరాహోరీగా ఎన్నికలు జరిగే ప్రాంతాలకు భిన్నంగా కుల సమీకరణాలతోనే ఈ నియోజకవర్గంలో ఎన్నికల ఫలితాలు ఆధారపడి ఉంటాయి. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వంలోనే కోనసీమకు చెందిన కళా వెంకట్రావు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రివర్గంలో కీలక భూమిక వహించి అప్పట్లోనే ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మహామనిషి. రాజకీయ పార్టీల ప్రభంజనంలో సైతం అయిదు పర్యాయాలు ఇక్కడ స్వతంత్ర అభ్యర్థులే విజయం సాధించారు. నాలుగు పర్యాయాలు కుదుపూడి ప్రభాకరరావు, మూడు పర్యాయాలు మెట్ల సత్యనారాయణరావు ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. 1955 ఎన్నికల్లో ఎస్సీలకు రిజర్వు అయిన ఈ స్థానం 1962 నుంచి జనరల్ నియోజకవర్గంగా మారింది. పునర్విభజన అనంతరం 2009లో తిరిగి ఎస్సీలకు రిజర్వు అయ్యింది. అమలాపురం మున్సిపాలిటీ, అల్లవరం, అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం మండలాలతో కలిసి ఈ నియోజకవర్గం ఆవిర్భవించింది. అయినప్పటికీ రెండు ప్రధాన సామాజిక వర్గీయుల ఓట్ల తీర్పు ఆధారంగానే అభ్యర్థి భవితవ్యం ఆధారపడి ఉంటుంది. ఈ నియోజకవర్గ ఓటర్ల అంతరంగం నేతలకు ఎప్పటికీ అంతుపట్టని విషయం..

స్వతంత్రులదే హవా

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో పరిపాలన సాగే సమయంలో కాకినాడ కేంద్రంగా అమలాపురం అంతర్భాగమై ద్విసభ నియోజకవర్గం ఏర్పడింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రి హోదాలో పనిచేసిన కళా వెంకట్రావు కాంగ్రెస్ అభ్యర్థిగా 1952లో జరిగిన ఎన్నికల్లో కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ తరఫున పోటీ చేసిన నడింపల్లి రామభద్రరాజు చేతిలో పరాజయం పొందారు. అప్పట్లోనే షెడ్యూల్డు కులాల సమాఖ్య పేరిట ఎన్నికల బరిలోకి దిగిన బొజ్జా అప్పలస్వామి తన సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి పి.లక్ష్మణస్వామిపై విజయం సాధించారు. 1955లో అమలాపురం ద్విసభ నియోజకవర్గం నుంచి సీపీఐకి చెందిన జి.నారాయణదాసుపై స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన గుత్తుల నరసింహమూర్తి గెలుపొందారు. సీపీఐకి చెందిన ఎస్ఆర్ రావుపై బొజ్జా అప్పలస్వామి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి అప్పట్లో మరోసారి విజయకేతనం ఎగురవేశారు. 1962లో కుదుపూడి సూర్యనారాయణ, 1967లో కుదుపూడి ప్రభాకరరావు వరుసగా స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగి విజయం సాధించడం విశేషం. స్వతంత్రంగా గెలవడంలో కుదుపూడి వంశీయులకు చరిత్రే ఉంది. తిరిగి 2004లో జరిగిన హోరాహోరీ ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన కుదుపూడి చిట్టబ్బాయి ఘన విజయం సాధించడం ద్వారా కుదుపూడి వంశీయులు హ్యాట్రిక్ సాధించి మరోసారి రికార్డులకు ఎక్కారు. అయితే ఈ నియోజకవర్గంలో శెట్టిబలిజ, కాపు సామాజిక వర్గీయుల అభ్యర్థుల మధ్య ప్రధాన పోరు నెలకొంది. ప్రస్తుతం రిజర్వ్‌డ్ నియోజకవర్గమైనా అదే పరిస్థితి కొనసాగుతుంది. 1972లో కుదుపూడి ప్రభాకరరావు రవణం రామచంద్రరావుపైనా, 1978లో పలచోళ్ల వెంకటరామారావు, దొమ్మేటి నాగేశ్వ రరావుపై పోటీ చేసి గెలు పొందారు. 1983లో మెట్ల సత్య నారాయణరావు కుదుపూడి ప్రభాకరరావుపైన, 1985లో కుదుపూడి ప్రభాకరరావు రవణం రామ చంద్రరావుపైనా, 1989లో కుదుపూడి ప్రభాకరరావు మెట్ల సత్యనారాయణరావుపై గెలుపొందారు. 1994, 99లో జరిగిన ఎన్నికల్లో కుదుపూడి ప్రభాకరరావుపై మెట్ల సత్యనారాయణరావు విజయకేతనం ఎగురవేశారు. 2004లో జరిగిన ఎన్నికల్లో కుదుపూడి చిట్టబ్బాయి మెట్ల సత్యనారాయణరావుపై విజయం సాధించారు. అనంతరం 2009లో జరిగిన ఎన్నికల్లో అమలాపురం నియోజకవర్గం పునర్విభజనతో ఎస్సీ వర్గీయులకు రిజర్వు చేయబడింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన పినిపే విశ్వరూప్ ప్రజారాజ్యం తరఫున పోటీ చేసిన చింతా కృష్ణమూర్తిపై విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పినిపే విశ్వరూప్‌పై టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగిన అయితాబత్తుల ఆనందరావు ఘన విజయం సాధించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఆనందరావుపై త్రిముఖ పోటీలో వైసీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ విజయం సాధించారు. ఈ నియోజకవర్గం నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో రాష్ట్ర మంత్రివర్గంలో కుదుపూడి ప్రభాకరరావు, మెట్ల సత్య నారా యణరావు, పినిపే విశ్వరూప్‌లు మంత్రి పదవులు నిర్వహించారు.

• (అమలాపురం టౌన్)

తీర్పుల్లో సంచలనం

రాజకీయాల జోరు కాదు.. సామాజిక వర్గాల పోరే..!

ఐదు సార్లు స్వతంత్రులదే హవా..

ఏ ఎన్నికలైనా రెండు సామాజికవర్గాల నేతలదే ఆధిపత్యం

సంవత్సరం	విజేత	పార్టీ
1952)	నడింపల్లి రామభద్రరాజు	కేఎంపీపీ
	బొజ్జా అప్పలస్వామి	
1955	బొజ్జా అప్పలస్వామి	స్వతంత్ర
	గుత్తుల నరసింహమూర్తి	స్వతంత్ర
1962	కుదుపూడి సూర్యనారాయణ	స్వతంత్ర
1967	కుదుపూడి ప్రభాకరరావు	స్వతంత్ర
1972	కుదుపూడి ప్రభాకరరావు	కాంగ్రెస్
1978	పలచోళ్ల వెంకటశ్రీరామారావు	జనతా
1983	మెట్ల సత్యనారాయణరావు	టీడీపీ
1985	కుదుపూడి ప్రభాకరరావు	కాంగ్రెస్
1989	కుదుపూడి ప్రభాకరరావు	కాంగ్రెస్
1994	మెట్ల సత్యనారాయణరావు	టీడీపీ
1999	మెట్ల సత్యనారాయణరావు	టీడీపీ
2004	కుదుపూడి చిట్టబ్బాయి	స్వతంత్ర
2009	పినిపే విశ్వరూప్	కాంగ్రెస్
2014	అయితాబత్తుల ఆనందరావు	టీడీపీ
2019	పినిపేవిశ్వరూప్	వైసీపీ



చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనం(ఫైల్)

ఓటర్ల వివరాలు

అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 2,12,593 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 1,05,863 మంది పురుషులు, 1,06,729 మంది మహిళలు ఉండగా, ఇతరులు ఒకరు ఉన్నారు. నియోజకవర్గంలో 235 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, వాటిలో 138 సమస్యాత్మక, 35 అతిసమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్టు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు.





అభివృద్ధి పనులు ఎప్పటికి పూర్తయ్యేనో..

నియోజకవర్గంలో అమలాపురం రూరల్ మండలం సమనసలో 32.27 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి సుమారు మూడేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. రూ.360 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పనులు నిధుల కొరతతో మందకొడిగా సాగుతున్నాయి. జిల్లా కేంద్రమైన అమలాపురం ఆర్టీసీ బస్టాండు సెంటర్‌ను రూ.5 కోట్ల అంచనా వ్యయంతో ఆధునికీకరించేందుకు శంకుస్థాపన చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలాపురం పట్టణంలో చేపట్టిన సుందరీకరణ పనులతో పాటు కోట్లాది రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. అమలాపురం గడియార స్తంభం సెంటర్ ఆధునికీకరణ, డివైడర్ల ఏర్పాటు వంటి పనులు చేసినప్పటికీ వాటిని సంరక్షించే పరిస్థితులు లేకుండాపోయాయి. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనం, డాక్టర్ మెట్ల హెల్త్ పార్కులు నిర్మించారు. చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనం పరిస్థితి నేడు అంతకంతకు దిగజారిపోతుంది.



అమలాపురం మార్కెట్ సెంటర్‌లో చెత్తాచెదారంతో నిండిన డ్రైన్

సమస్యలు ఇవే..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రంగా నిలిచిన అమలాపురం పట్టణంతో పాటు నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. ప్రగతికి, ఆర్థిక పురోభివృద్ధికి అవసరమైన వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ వాటిని వినియోగించుకోవడంలో వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కోటిపల్లి వయా అమలాపురం మీదుగా నర్సాపురం వరకు రైల్వేలైన్ నిర్మాణం దశాబ్దాల కాలంగా మందకొడిగా సాగుతోంది. పైగా రైల్వే స్టేషన్, అతిథిగృహాల కోసం కూడా ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేసిన శిలాఫలకాలు వారి వైఫల్యాలకు నిలువుటద్దంగా దర్శనమిస్తున్నాయి. అమలాపురం పట్టణంలో వందల కోట్ల పైబడే వ్యయంతో నిర్మించ తలపెట్టిన మంచినీటి ప్రాజెక్టుతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పథకం అంచనాలకే పరిమితమయ్యింది. కొబ్బరి ఆధారిత పరిశ్రమలతో పాటు గ్యాస్ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు పూర్తిస్థాయిలో ఆచరణ సాధ్యం కావడం లేదు. ప్రధాన రహదారుల వెంబడి ఉన్న ఆక్రమణలతో పాటు డ్రెయిన్లు, మురుగు కాల్వలు, పంట కాల్వలపై ఉన్న ఆక్రమణలు తొలగించడంలో ఉన్న రాజకీయ ప్రతిబంధకాలను అధిగమించి ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టాలి. కాల్వల ప్రవాహాలకు ఉన్న ప్రతిబంధకాలను తొలగించడం ద్వారా శివారు ప్రాంతాలకు సైతం సాగునీరు, తాగునీరు అందించవచ్చు. అమలాపురం పట్టణంలో పెరుగుతున్న రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ సమస్య నివారించాలి. పట్టణంతో పాటు నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు, శివారు ప్రాంతాలకు మంచినీటి సౌకర్యం విస్తరింపచేయాల్సి ఉంది. కూనవరం, రామేశ్వరంలోని స్ట్రెయిట్ కట్‌లను శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలి.

ఇంటర్వ్యూ

గ్రేటర్ రాజమహేంద్రి



- అదే లక్ష్యం.. ఆమేరకు అభివృద్ధి
- చారిత్రిక ఔన్నత్యాన్ని కాపాడతా
- నగరాన్ని ఆధ్యాత్మిక టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడమే ధ్యేయం
- గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లుండవు
- డ్రైనేజీ, ట్రాఫిక్ సమస్యలపై దృష్టి
- రాజమండ్రి సిటీ కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

ప్ర. పోలింగ్ తేదీ దగ్గరపడుతోంది.. ప్రచారం ఎలా సాగుతోంది?

జ. ప్రచారం బాగా జరుగుతోంది. కూటమి నేతలంతా ఐక్యంగా ముందుకు వెళుతున్నాం. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. మే 13 ఎప్పుడు వస్తుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. మూడు నెలల కిందట వైసీపీ భయంతో బెరుకుగా కనిపించిన ప్రజలు ఇప్పుడు నేరుగా స్వాగతం పలుకుతున్నారు.

ప్ర. ఆయా వర్గాల స్పందనేంటి? ఏ వర్గాల సమస్యలేమి చెబుతున్నారు?

జ. ఒక్కో వర్గానిది ఒక్కో ఆవేదన. దిగువ, మధ్యతరగతి ప్రజలు సంక్షేమం కోసం ఎదురుచూస్తారు. కానీ వైసీపీ రూపాయి ఇచ్చి రూ.100 లాగేసింది. క్వారీ మార్కెట్ ఏరియాలో భవన నిర్మాణ కార్మికులు ఎక్కువ. ఇసుక లేక ఉపాధి కోల్పోయారు. వలసపోతున్నారు. ఇప్పటికే మా పార్టీ అధినేత చంద్రబాబు ఉచిత ఇసుక హామీ ఇచ్చారు. ఇక నగరంలో ఇళ్లలో పనిచేసేవారు, షాపుల్లో పనిచేసేవారు, తోడుబండ్లు, చిన్నచిన్న చిల్లర వ్యాపారాలు చేసుకునేవారు, జట్టు కార్మికులు.. ఆటో, కారు డ్రైవర్లు, వివిధ వృత్తి పనుల వాళ్ల ఇలా అనేక మంది వైసీపీ వల్ల తమకు ఎంత నష్టం జరిగిందో చెబుతున్నారు. విద్యుత్ ధరల బాదుడు, పెట్రోలు ధరలు, నిత్యావసర సరుకుల ధరలు, చెత్త మొదలు అన్ని రకాల పన్నులతో అన్ని వర్గాలు ఇబ్బందులు పడుతున్నాయి. కూటమి అధికారంలోకి వస్తుంది. సంపద సృష్టించి అందరి సంక్షేమం చూడడంతోపాటు అభివృద్ధి కూడా చేస్తాం. ఇవాళ సూపర్ సిక్స్‌తో కూటమి ముందుకొచ్చింది.

ప్ర. మీకున్న గెలుపు అవకాశాలేంటి? అంత ధీమా ఎందుకు?

జ. 2019లో 30వేల ఓట్ల మెజార్టీతో నా సతీమణి ఆదిరెడ్డి భవానీ గెలిచింది. జనసేనకు 20 వేలకుపైగా ఓట్లు వచ్చాయి. పైగా రాజమండ్రి ఎప్పుడూ టీడీపీ కంచుకోట. ఇవాళ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా కలసి పోటీచేస్తున్నాయి. అటు అధికార వైసీపీ ప్రభుత్వంపై ప్రజలకు తీవ్ర అసంతృప్తి ఉంది. అశాంతి పెరిగింది. ప్రజలు సిద్ధంగా ఉన్నారు.. జగన్‌ను దించడానికి. ఇక జనసేన నేతలు అనుశ్రీ సత్యనారాయణ, వై.శ్రీనివాస్ కూడా నాతోపాటు వారూ అభ్యర్థుల మాదిరి కష్టపడి తిరుగుతున్నారు. అటు అన్న ఎన్టీఆర్ కుమార్తె, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఎంపీ అభ్యర్థినిగా కూటమి తరపున పోటీచేస్తుండడం ఆ పార్టీకి చెందిన సంప్రదాయ ఓట్లన్నీ మాకు బదిలీ కానున్నాయి.

ప్ర. బ్లేడ్‌బ్యాచ్‌లు, గంజాయి బ్యాచ్‌ల నుంచి రక్షణ ఎలా కల్పిస్తారు?

జ. సిటీలో 24 గంటలూ సీసీ కెమెరాల నిఘా పెంచుతాం. బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లను అరికట్టించే బాధ్యత నాది. వైసీపీ నేతలు ఈ బ్యాచ్‌లను ప్రోత్సహిస్తూ ఇతరులపై ఆరోపణలు చేస్తున్నారు. అధికారం ఉంది.. యంత్రాంగం వాళ్ల చేతుల్లో ఉంది.. ఎందుకు అరికట్టలేదు? మా హయాంలో ఇవేవీ సాగనీయం.

ప్ర. గెలిస్తే రాజమహేంద్రవరాన్ని ఎలా అభివృద్ధి చేయాలనుకుంటున్నారు?

జ. ఆరోగ్యకరమైన రాజమహేంద్రవరం లక్ష్యం. గ్రేటర్ రాజమహేంద్రవరంగా, మహానగరంగా అభివృద్ధి చెందాలి. పురందేశ్వరి సహకారంతో వచ్చే పుష్కరాల నాటికి రూ.500 కోట్ల అభివృద్ధి ప్రణాళిక సిద్ధంచేస్తున్నాం. క్లీన్‌సిటీగా తీర్చిదిద్దుతాం. అమృతపథకం ద్వారా గతంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మొదలైంది. వైసీపీ బిల్లులివ్వక పనులు ఆగిపోయాయి. బుచ్చయ్యచౌదరితో కలసి ఈ సమస్యను పరిష్కరిస్తాం. అఖండగోదావరి ప్రాజెక్టుతోపాటు టూరిజంహబ్ చేస్తాం. టెంపుల్ సర్క్యూట్‌తో ఆధ్యాత్మిక టూరిజం అభివృద్ధి చేస్తాం. రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేస్తాం. ఘాట్లన్నీ టూరిజానికి అనుకూలంగా మారుస్తాం. ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తాం. ప్రస్తుతం పార్కులకు ఎంట్రీ ఫీజు రద్దు చేస్తాం.

ప్ర. ప్రచారంలో మీ కుటుంబ సభ్యుల సహకారం ఎలా ఉంది?

జ. నా సతీమణి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ, తండ్రి అప్పారావు, అమ్మ వీర రాఘవమ్మ, అక్క జాగరపు జ్యోత్స్న, నా కుమారుడు జయేష్‌నాయుడు ప్రచారంలో ఉన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలసి వెళుతున్నారు. నేను 50 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తా. - ఆంధ్రజ్యోతి/రాజమహేంద్రవరం

సత్యదేవుని కల్యాణోత్సవాలపై సమీక్ష



కల్యాణోత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

అన్నవరం, ఏప్రిల్ 28: అన్నవరం సత్యదేవుడి దివ్య కల్యాణోత్సవ ఏర్పాట్లపై ఆదివారం మధ్యాహ్నం పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు అధ్యక్షతన ఈవో రామచంద్రమోహన్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది స్వామివారి దివ్య కల్యాణోత్సవాలు మే 18న ప్రారంభమై 24 వరకు జరగనుండగా 19 రాత్రి వార్షిక కల్యాణ వేదికపై అంగరంగవైభవంగా సత్యదేవుడి కల్యాణం జరగనుంది. ముఖ్యంగా 19 రాత్రి జరిగే కల్యాణోత్సవాలపై వివిధ శాఖల అధికారులకు ఆర్డీవో లక్ష్యాలు నిర్దేశించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ ఏడాది కల్యాణాలకు ప్రముఖులు, రాజకీయ నాయకులు వచ్చే అవకాశం లేకపోవడంతో సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. కల్యాణం వీక్షించేందుకు సుమారు 15 వేలమంది భక్తులు విచ్చేసే అవకాశం ఉందని ప్రాథమికంగా అంచనా వేశారు. కల్యాణ వేదిక ఎదురుగా ప్రత్యేక గ్యాలరీలు, దూరం నుంచి వీక్షించే వారి కోసం ఎల్ఈడీ స్ర్కీన్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కల్యాణం రోజున సాయంత్రం 4గంటల నుంచి భారీ వాహనాలను కొండపైకి అనుమతించకుండా కార్లు, బైక్‌లను అనుమతించాలని నిర్ణయించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు బాధ్యతలు పోలీస్‌శాఖకు అప్పగించారు. ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. కల్యాణోత్సవాలు వారం రోజులు మూడుచోట్ల మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. కల్యాణంరోజున రెండు అగ్నిమాపక యంత్రాలు అందుబాటులో ఉంచాలని ఫైర్ అధికారులను ఆర్డీవో ఆదేశించారు. కల్యాణం అనంతరం ప్రత్యేక కౌంటర్ల ద్వారా పోలీస్‌సిబ్బంది సాయంతో కల్యాణం అక్షింతలు, ప్రసాదం వితరణ చేయాలని సూచించారు. సత్యదేవుడి చక్రస్నానం రోజున పంపా సరోవరంలో కనీస నీటిమట్టం ఉండేలా చూసే బాధ్యతలను ఇరిగేషన్ అధికారులకు అప్పగించారు. స్వామివారి కల్యాణాలు జరిగే వారం రోజులు గ్రామంలో మెయిన్‌రోడ్డు వద్దనున్న మద్యం దుకాణాలు మూయించాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది స్వామివారి శ్రీపుష్పయోగం అనివేటి మండపంలో చేపట్టాలని నిర్ణయించారు. గోటి తలంబ్రాలు సంప్రదాయం అన్నవరంలో లేనందున పూర్వపు పద్ధతిలో చేపట్టాలని నిర్ణయించారు.

ఏపీ సెట్‌కు 5452 మంది హాజరు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 28: రాజమహేంద్రవరం రీజనల్ పరిధిలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్హత పరీక్ష (ఏపీసెట్)కు 5452 మంది అభ్యర్థులు హాజరయ్యారని, పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగిందని ఏపీ సెట్ రాజమహేంద్రవరం రీజనల్ కోఆర్డినేటర్ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలో 11 కేంద్రాలలో పరీక్ష నిర్వహించారన్నారు. దీనికి 6854 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా వారిలో 1402 మంది హాజరుకాలేదని చెప్పారు. 80 శాతం అభ్యర్థులు అనగా 5452 మంది హాజరై పరీక్ష రాశారన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు రాజమహేంద్రవరంలోని ఎస్.కె.వి.టి కళాశాల, శ్రీకందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన ఏపీ సెట్ పరీక్షా కేంద్రాలను సందర్శించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. సహాయ ప్రాంతీయ కోఆర్డినేటర్ ఎస్.లింగారెడ్డి పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

పెన్షనర్లను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28: ప్రజలను, పెన్షనర్లను దారుణంగా మోసం చేసిన జగన్ ప్రభుత్వాన్ని చిత్తుచిత్తుగా ఓడించాలని అఖిల భారత రాష్ట్ర పెన్షనర్ల సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి జి.పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం తిలక్ రోడ్డులోని టీడీపీ ఎన్నికల కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. ఒకటో తేదీన పెన్షన్ వేయకుండా ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెన్షనర్లకు పీఆర్సీ, డీఏలు, జీపీఎఫ్ మెడికల్ బిల్లుల బకాయిలు రూ.30 వేల కోట్లు ఉన్నాయన్నారు. 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో, 25 ఎంపీ స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగుల సంఘం నేత విజ్‌డం చౌదరి మాట్లాడుతూ ప్రశ్నించే ఉద్యోగులపై అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేసిన జగన్ రెడ్డిని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. అనంతరం సంఘం కరపత్రాలను అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ఆవిష్కరించారు. రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు గురవయ్య, ఏపీ వైద్యఆరోగ్యశాఖ ఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షుడు ఆచంట రామరాయుడు పాల్గొన్నారు.

బ్రాహ్మణులంతా ఏకంకావాలి

లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న నాగబాబు



హోమంలో పాల్గొన్న నాగబాబు దంపతులు

పిఠాపురం, ఏప్రిల్ 28: బ్రాహ్మణ సమాజం అభ్యున్నతి కోసం బ్రాహ్మణులంతా ఏకమవ్వాలని జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు సూచించారు. పిఠాపురం పట్టణంలోని విరవాడ రోడ్డులోని బ్రాహ్మణ అగ్రహారంలో ఆదివారం జరిగిన లక్ష్మీగణపతి హోమం పూజా కార్యక్రమాల్లో నాగబాబు, పద్మ దంపతులు పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గంలోని వేదపండితులు, బ్రాహ్మణులు, అర్చకులు, పురోహితులు నాగబాబును కలిసి బ్రాహ్మణ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు గురించి వివరించారు. బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి మొట్టమొదటిసారిగా బహిరంగ వేదికపై మాట్లాడిన నాయకుడు పవన్‌కల్యాణ్ అని తెలిపారు. పవన్ పిఠాపురంలో పోటీ చేస్తానని ప్రకటించిన మొదటి రోజే విజయం ఖరారు అయిందని చెప్పారు. పవన్‌కల్యాణ్ పిఠాపురాన్ని టెంపుల్ సర్క్యూట్ సిటీగా అభివృద్ధి చేస్తామని, రూ.100కోట్లు నిధులు తీసుకువచ్చి ఆలయాలను అభివృద్ధి చేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. బ్రాహ్మణుల సమస్యల పరిష్కారాన్ని పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి ఒక గంటలో వచ్చే ఆదాయంతో పిఠాపురం లాంటి చోట్ల ఆలయాలు అన్నింటిని అభివృద్ధి చేయవచ్చునని తెలిపారు. బ్రాహ్మణ సమాజం రాజ్యాధికారంలో సమానత్వం కోసం పోరాడాలని జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ సూచించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తోలేటి శిరీష, జబర్దస్త్ ఫేం రాకెట్ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహునికి బంగారు కిరీటం బహూకరణ



స్వామివారికి బహూకరించిన కిరీటం

అంతర్వేది, ఏప్రిల్ 28: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నరసింహస్వామి వారి విగ్రహానికి అలంకరణ నిమిత్తం నెల్లూరుకు చెందిన ఎవర్‌మార్క్ న్యూట్రాసిటికల్స్ ఎల్ఎల్‌పీ సంస్థ అధినేతలు అప్పల రంగనాథం, అప్పలరాజ్‌కుమార్, కవిత, అప్పల దిలీప్ చక్రవర్తి కల్పన రూ.9.70 లక్షల విలువైన 155 గ్రాముల బంగారు కిరీటాన్ని ఆదివారం బహూకరించారు. తొలుత అర్చక స్వాములు బంగారు కిరీటానికి సంప్రోక్షణ, ప్రత్యేక పూజలు నిర్వహించి నరసింహస్వామివారి ఉత్సవ విగ్రహానికి అలంకరించారు. అనంతరం బంగారు కిరీటాన్ని బహూకరించిన దాతలకు అర్చకులు, వేద పండితులచే మహదాశీర్వచనం జరిపించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, బోనం సారథి, బోనం రాజు, ఎవర్‌మార్క్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు



మాట్లాడుతున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్ ఏప్రిల్ 28: విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని వివిధ అంశాలపై తర్ఫీదు పొందాలని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులో గల విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ సెలవుల్లో కొంత సమయాన్ని జ్ఞానాన్ని పెంపొందించుకొనేందుకు, కొంత సమయాన్ని ఆర్ట్స్, క్రాఫ్ట్స్ లాంటి వివిధ కళలు అభ్యసించడానికి కేటాయించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలు భవిష్యత్‌లో ఐఐటీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్టాత్మకమైన జాతీయ కళాశాలల్లో విద్యనభ్యసించాలంటే స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ మెడికల్ ఫౌండేషన్ అవసరంపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రతి తల్లిదండ్రులు పిల్లలను భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే విధంగా తయారుచేయాలని సూచించారు. సంస్థ డైరెక్టర్ సరోజినీదేవి మాట్లాడుతూ తల్లిదండ్రులే పిల్లలకు రోల్ మోడల్‌గా ఉండాలని అన్నారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు పుస్తకాలకన్నా ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు ఎక్కువగా అలవాటు పడ్డారని, వారు పుస్తకాలతో కన్నా మొబైల్‌తో ఎక్కువ సమయం గడిపితే జరిగే నష్టం గురించి వివరించాలని తెలిపారు. విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, పూర్వవిద్యార్థుల తల్లి దండ్రులు కె.చలం, జి.వనజ పాల్గొన్నారు.

మద్యపానం నిషేధిస్తామని మేం చెప్పామా!?

- మాట తప్పామని చెప్పకనే చెప్పిన మంత్రి వేణు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మద్యపాన నిషేధానికి సంబంధించి నేను చాలా క్లియర్‌గా చెప్పాను. క్రమంగా అమలు చేస్తాం. దశలవారీ పద్ధతుల్లో నిషేధిస్తాం. దానికి కట్టుబడి ఉన్నాం. 2024 ఎలక్షన్ సమయానికి మాత్రం కచ్చితంగా మద్యాన్ని ఫైవ్‌స్టార్ హోటల్స్‌కి మాత్రమే పరిమితం చేసిన తర్వాతే నేను ఓట్లు అడుగుతాను అని జగన్ 2019 మే 26న చెప్పారు. కానీ, జగన్ మాట తప్పడాన్ని మద్యం దుకాణాలు వెక్కిరిస్తుండడాన్ని అందరూ చూస్తూనే ఉన్నారు. ఇది చాలదన్నట్లు మద్యపానం నిషేధించామని మేం చెప్పడంలేదు కదా అని మంత్రి వేణు నిజం ఒప్పుకున్నారు. తమ మేనిఫెస్టో నిజం అంటూనే ఒక అబద్ధాన్ని నిజం అని తేల్చేశారు. వైసీపీ మేనిఫెస్టోపై ఊదరగొట్టడానికి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రాజానగరం ఎమ్మెల్యే రాజాతో కలిసి ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మద్యం నిషేధంపై మాట తప్పామని ఒప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం వైసీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, అనసూరి పద్మలత, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు.

ఇన్నాళ్లూ మాఫియా పాలనలోనే బ్రతికాం

- బీజేపీ ఎంపీ అభ్యర్థి పురంధేశ్వరి

సీతానగరం, ఏప్రిల్ 28: గత ఐదేళ్లుగా మనం మాఫియా పాలనలో బ్రతికాం ఇప్పుడు మన రాష్ట్రాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకత మనకు ఉంది. ఆలోచించి ఓటువేయాలి అని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి అన్నారు. ఆదివారం చినకొండేపూడిలోని జీవీకే ఫంక్షన్ హాల్‌లో జరిగిన కూటమి పార్టీల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చిట్టూరి రవీంద్ర, బొడ్డు వెంకటరమణ చౌదరి, బత్తుల బలరామకృష్ణ, బత్తుల వెంకటలక్ష్మితోపాటు ఆమె మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా లాండ్, శాండ్, లిక్కర్, గ్రావెల్ తదితర మాఫియాలతోనే పాలన సరిపోయిందని, దీంతో రాష్ట్రం తిరోగమనంలో పయనించి ప్రజల నెత్తిన అప్పుల భారం పెరిగిందన్నారు. వైసీపీ ఎన్నికల మేనిఫెస్టో అబద్దాలతో నింపేశారని అన్నారు. కార్యక్రమంలో నీరుకొండ వీరన్నచౌదరి, కాండ్రు వీరన్న, వలవల రాజా, లక్కిశెట్టి శ్రీనివాసరావు, కాండ్రు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదాపై పోరాడాలి

- కర్నాకుల వీరాంజనేయులు

గోకవరం, ఏప్రిల్ 28: రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్రజా సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రైతు కూలీసంఘంతో పాటు పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సాగుతున్న జనచైతన్య యాత్ర ఆదివారం గోకవరం మండలం కామరాజుపేట పంచాయతీ పరిధిలో గల శివరామపట్నం చేరుకొంది. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారులు తమ ఆటపాటలతో ప్రజలను ఉత్తేజపరుస్తూ ప్రచారాన్ని నిర్వహించారు. ఆప్రచారాన్ని ఉద్దేశించి రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్రజా సమస్యలపై ప్రజలు పోరాడాలన్నారు. పాలక పార్టీలు ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, గెలిచిన తర్వాత ఆ హామీలను మరుగున పడేయడం పరిపాటిగా మారిందని ఎద్దేవా చేశారు. 2019 ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రత్యే హోదా నినాదంతో అధికారం చేపట్టి మాట తప్పారని గుర్తు చేసారు. ప్రజా, రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను తీసుకొచ్చి ప్రజలపై అధిక ధరలు, పన్నుల భారాన్ని మోపుతున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే పాలకవర్గాల నాయకులను రాష్ట్రానికి ప్రత్యేకహోదా, ప్రజా సమస్యలపై నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వల్లూరి రాజబాబు, బి.రమేష్, కొండా దుర్గారావు, భాస్కర్, కుంచే అంజిబాబు, బి.గంగ, కె.సతీష్, తదితరులు పాల్గొన్నారు.

కోట సత్తెమ్మకు విశేష పూజలు

నిడదవోలు, ఏప్రిల్ 21: మండలంలోని తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుప్రభాతసేవ ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు, క్షీర నివేదన మహానివేదన నిర్వహించారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజుకావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది.

గండి పోచమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

దేవీపట్నం, ఏప్రిల్ 28: మండల పరిధిలో ఉన్న మాతృశ్రీ గండిపోశమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. జిల్లాల నలుమూలల నుంచి భక్తులు వేకువజామునే గోదావరిలో పుణ్యస్నానమాచరించి అమ్మ వారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి టిక్కెట్ తదితర వాటి ద్వారా రూ.28,880 ఆదాయం వచ్చినట్లు పదివేల మంది భక్తులకుపైగా హాజరైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడిగా వరుసగా 8వ సారి పడాల ఎన్నిక



శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడిగా ఎన్నికైన సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న సమితి నూతన కార్యవర్గం

అనపర్తి, ఏప్రిల్ 28 : అనపర్తిలోని శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడిగా పడాల సుబ్బారెడ్డి వరుసగా ఎనిమిదవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అనపర్తిలోని కోళ్ళ రైతుల కళ్యాణ మండపంలో సమితి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పడాల సుబ్బారెడ్డి ఉపాధ్యక్షుడిగా సత్తి వెంకటరెడ్డి, తేతల సుందరరామారెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, పీవీఎస్‌వీ సతీష్, ప్రధాన కార్యదర్శిగా నల్లమిల్లి సుబ్బారెడ్డి, కార్యదర్శులుగా తాడి చంద్రశేఖరరెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి సత్తిరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ సభ్యుడు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు.

కర్ణాటక సంగీతం, కూచిపూడి నాట్యం శిక్షణా తరగతులు ప్రారంభం

గోకవరం, ఏప్రిల్ 28: భారతీయ కళలను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో నామమాత్ర రుసుముతో కర్ణాటక సంగీతం, కూచిపూడి నాట్యం వంటి శిక్షణా తరగతులను గోకవరంలో ఆదివారం ప్రారంభించినట్లు విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటికే పలు దేవాలయాల అభివృద్ధికి లక్షలాది రూపాయలను వెచ్చించడంతోపాటు, అనేకమంది పేదలకు వివిధ రూపాలలో సేవలందిస్తున్న శ్రీనివాసరావు విద్యార్థుల భవిష్యత్తు కోసం మరో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కళాభారతికి వందనం పేరుతో కర్ణాటక సంగీతం, కూచిపూడి నాట్యం శిక్షణా తరగతులను దాసరి ధర్మరాజు ఆధ్వర్యంలో ప్రారంభించారు. సుమారు 350 మంది విద్యార్థులు ఈశిక్షణా తరగతులకు హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దాసరి తమ్మన్నదొర, వరసాల ప్రసాద్, రామసేన సభ్యులు తామర్ల రాంబాబు, మామిడి అయ్యప్ప, ఇనగోటి బాపన్నదొర, వల్లూరి జగన్నాధశర్మ, ఉంగరాల ఆదివిష్ణు, మహిపాల దుర్గారావు పాల్గొన్నారు.



కర్ణాటక సంగీతం, కూచిపూడి నాట్యం శిక్షణా తరగతులను ప్రారంభించిన కంబాల శ్రీనివాసరావు

ఎన్డీయే కూటమికే అన్నివర్గాల మద్దతు

- అనపర్తి ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఏప్రిల్ 28 : వైసీపీ మోస పూరిత మాటలు నమ్మి దగాపడ్డ అన్ని వర్గాల ప్రజలు ఎన్డీయే కూటమికి మద్దతు పలుకుతున్నారని వచ్చే ఎన్నికలలో ఎన్డీయే కూటమి విజయానికి సహకరిస్తున్నారని అనపర్తి నియోజకవర్గ ఎన్డీయే కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అనపర్తి మండలం రామవరంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బుంగ సంజయ్ జిల్లా నాయకులతో కలిసి నల్లమిల్లికి మద్దతు ప్రకటించారు. సంజయ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం దళితులకు తీరని అన్యాయం చేసిందన్నారు. తమకు అందాల్సిన నిధులను దారి మళ్లించడమే కాకుండా 27 పథకాలను రద్దు చేసి తీరని అన్యాయం చేసిందన్నారు. వచ్చే ఎన్నికలలో దళితులంతా ఎన్డీయే కూటమి విజయానికి కృషి చేస్తావ న్నారు.



రామవరంలో నల్లమిల్లికి మద్దతు తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు

నియోజవకర్గంలో ప్రచారంలో ఎన్డీయే కూటమి

అనపర్తి నియోజకవర్గంలో ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి విజయం కోసం అటు నేతలు ఇటు కార్యకర్తలు ప్రచారంలో దూసుకుపోతున్నారు. రంగంపేట మండలంలో దొడ్డిగుంట, వెంకటాపురం, ఈలకొలను గ్రామాల్లో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించ గా అనపర్తిలోని బాపనమ్మగుడి ఏరియా, శివాలయం వీధి, పాత హరిజనపేట ప్రాంతాల్లో నల్లమిల్లి సతీమణి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆదే విధంగా బిక్కవోలులో నల్లమిల్లి తనయుడు మనోజ్‌రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పెదపూడి మండలం గొల్లల మామిడాడలో నల్లమిల్లి తనయ డాక్టర్ సనాతని ఇంటింటా ప్రచారం నిర్వహించి కమలం గుర్తుపై అటు ఎంపీ అభ్యర్థి అభ్యర్థి పురందేశ్వరిని, ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో ఎన్డీయే కూటమి ప్రచారానికి విశేష ఆదరణ లభిస్తుంది. ఈ సందర్భంగా నల్లమిల్లి సతీమణి మహాలక్ష్మి మాట్లాడుతూ ప్రచారంలో ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందని వైసీపీ ప్రభుత్వ ధోరణికి ప్రజలు విసుగుచెందారని ఎన్డీయే కూటమిని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.



అనపర్తిలో దివ్యాంగురాలికి సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తున్న నల్లమిల్లి సతీమణి మహాలక్ష్మి

రంగంపేటలో రామకృష్ణారెడ్డి ఎన్నికల ప్రచారం

రంగంపేట, ఏప్రిల్, 28: అనపర్తి నియోజకవర్గ బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ఎన్డీయే ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం సాయంత్రం రంగంపేట మండలంలో గల దొడ్డిగుంట, వెంకటాపురం, ఈలకొలను గ్రామాల్లో ఇంటిం టికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని రాక్షసపాలన నుంచి రక్షించుకోవాలన్నారు. దొడ్డిగుంట, వెంకటాపురం, ఈలకొలను గ్రామాల్లో ప్రజలు రామకృష్ణారెడ్డికి ఘనస్వాగతం పలికారు.



రంగంపేట: దొడ్డిగుంటలో గ్రామస్థులను ఓటు అడుగుతున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి జనసేన ప్రచార సమన్వయకర్తగా నాగు


పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న నాగు

అనపర్తి, ఏప్రిల్ 28 : జనసేన అనపర్తి నియోజకవర్గ ప్రచార సమన్వయకర్తగా అనపర్తి నియోజకవర్గ జనసేన నాయకుడు రావాడ నాగు నియమితులయ్యారు. పార్టీ అభివృద్ధికి కృషి చేసి న నాగును నియోజకవర్గ ప్రచార సమన్వయకర్తగా నియమిస్తూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఉత్తర్వులు జారీ చేశారు. నాగు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ అనపర్తి నియోజకవర్గ ఎన్డియే కూట మి విజయానికి కృషి చేస్తానని అన్నారు.

ఏజెన్సీ సమాచారం

సార్వత్రిక ఎన్నికలపై అవగాహన సదస్సు


యువతకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న దృశ్యం

మోతుగూడెం, ఏప్రిల్ 28: డొంకరాయి ఎస్ఐ శివకుమార్ సిబ్బందితో వై. రామవరం మండలం బొడ్డగండి గ్రామపంచాయతీ బచ్చులూరు రాజు క్యాంప్, బెంగాలీ క్యాంప్, మంగంపాడు గ్రామాల్లో వచ్చే సార్వత్రిక ఎన్నికలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చింతూరు సీఐ గజేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని, వచ్చే సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగేలా సహకరించాలన్నారు. మావోయిస్టుల వంటి సంఘ విద్రోహశక్తులకు ఆశ్రయం కల్పించినా, సహాయం చేసినా నేరమని, మావోయిస్టులు దళం వంటి వారికి సహాయం చేస్తే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో బెంగాలీక్యాంప్‌యువతకు వాలీబాల్ కిట్ అందజేశారు. పిల్లలకు, పెద్దలకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సత్యనారాయణ,హెడ్ కానిస్టేబుల్ ఐ. శ్రీనివాసరావు, కానిస్టేబుల్స్ గంగారాజు, పోశయ్యా, గ్రామస్తులు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం

మోతుగూడెం, ఏప్రిల్ 28: చింతూరు మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీ వేముల రాయ్ గ్రామంలో బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి కూటమి అభ్యర్థి కొత్తపల్లి గీత, అరకు పార్లమెంట్ అభ్యర్థిగా మిరియాల శిరీష దేవి రంపచోడవరం నియోజకవర్గం శాసనసభ అభ్యర్థి గెలుపు కోసం కొత్తపల్లి పంచాయతీలో బీజేపీ, టీడీపీ నాయకులు ముమ్మరంగా ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఇళ్ళ చిన్నారెడ్డి, బీజేపీ అధ్యక్షులుడి.రమణారెడ్డి, టీడీపీ నాయకులు శీలం తమ్మయ్యపొదిలి రామారావు, సల్మాన్‌రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షులు పురం చిన్న, ముత్తయ్య, బాలకృష్ణ శ్యామలా వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతల రోడ్ షో

రాజవొమ్మంగి ఏప్రిల్ 28: రాజవొమ్మంగి మండలంలో ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ,బీజేపీ, జనసేన కూటమి నేతలు నిర్వహించిన రోడ్ షో నిర్వహించారు. గిరిజన గ్రామాల్లో ప్రజలు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి రోడ్ షోకు స్పందన లభించింది. మండలంలోని వట్టిగెడ్డ గ్రామం నుంచి ప్రారంభించిన రోడ్ షోలో అధికసంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపి నేతలు పాల్గొన్నారు. వట్టిగెడ, తంటికొండ, నెల్లిమెట్ల, లబ్బర్తి, లాగరాయి,కింద్ర, కిర్రాబు, అనంతగిరి, శరభవరం, కొండపల్లి, అమ్మిరేకుల, కిమ్మలగెడ్డ తదితర గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు .రంపచోడవరం టీడీపీ, బీజేపి, జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిని మిరియాల శిరీష దేవి గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతకు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం తన ఇంటి తలుపులు తెరిచి ఉంటాయని శిరీష దేవి అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, జనసేన మండలాధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు, బీజేపీ మండలాధ్యక్షుడు తాము సూరిబాబు, మాజి సొసైటి అధ్యక్షుడు గణజాల తాతరావు, అధికసంఖ్యలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన జడ్పీటీసీ వడుగుల జ్యోతి


జడ్పీటీసీ వడుగుల జ్యోతి, ఆమె భర్త రవికి పార్టీ కండువా వేస్తున్న శిరీష

రాజవొమ్మంగి జడ్పీటీసీ వడుగుల జ్యోతి, ఆమె భర్త రవి, వైసీపీ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ చీడిపల్లి అప్పారావు తమ కార్యకర్తలతో ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గత వారం వైసీపీ పార్టీలో గుర్తింపు లేదంటూ ఆ పార్టీకి వీరు రాజీనామా చేయగా ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా వట్టిగెడ్డగ్రామంలో టీడీపీ నేతలు చేపట్టిన ప్రచార కార్యక్రమం అనంతరం రామాలయం వద్ద టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిని మిరియాల శిరీష దేవి జడ్పీటీసీ వడుగుల జ్యోతి, ఆమె భర్త రవి, చీడిపల్లి అప్పారావులను టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వట్టిగెడ్డ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిని శిరీష ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు.

టీడీపీ గెలిస్తే ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

● టీడీపీ నాయకులు నలజాల శ్రీకాంత్

ఎటపాక, ఏప్రిల్28 : టీడీపీ అధికారంలోకి వస్తే..ప్రతీ ఇంటికీ ప్రజా సంక్షేమ పథకాలతోపాటు మహిళలకు ఆర్థిక లబ్ధి చేకూరుతుందని టీడీపీ జిల్లా నాయకులు నలజాల శ్రీకాంత్ చౌదరి అన్నారు. ఆదివారం నెల్లిపాక గ్రామంలో సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారంను నిర్వహించారు. రంపచోడవరం అసెంబ్లీ ఎన్డీఏ కూటమి అభ్యర్థిని మిరియాల శిరీషాదేవీ, అరకు నియోజకవర్గ అభ్యర్థిని కొత్తపల్లి గీతలకు ఓటు వేయాలని అభ్యర్ధించారు. ఇంటింటికీ సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించి, రంపచోడవరం అభ్యర్థిని గెలిపించి, చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇస్తామన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏలూరి వెంకన్న, సర్పంచ్ కొర్సా భద్రమ్మ , జనసేన నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో 50 కుటుంబాలు చేరిక


టీడీపీలో చేరిన 50 కుటుంబాల వారు

ఎటపాక మండలం, పిచుకలపాడు పంచాయతీలోని తోగ్గూడం గ్రామం నుంచి 50 కుటుంబాలు ఆదివారం టీడీపీలో చేరారు. అరకు పార్ల మెంటరీ కార్యదర్శి ముప్వా శ్రీనువాస్, మండలాధ్యక్షుడు పుట్టి రమేష్ వీని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ముప్వా, పుట్టి రమేష్ మాట్లాడారు. వైసీపీపై ఉన్న వ్యతిరేకతతోనే ప్రజలు టీడీపీ వైపు వస్తున్నారని , రానున్నది ఎన్డీఏ కూటమి ప్రభుత్వమని అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా ఆలోచించి ఓటు వేయాలని కోరారు. టీడీపీతో యువతకు ఉద్యోగాలు, మహిళలకు, సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈకార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, గొడేటి రవికుమార్, గుండి సీతారాములు, చేకూరివెంకట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కోదండ రామాలయంలో అన్నదానం

మోతుగూడెం,ఏప్రిల్ 28: చింతూరుమండలం మోతుగూడెం శ్రీ కోదండ రామాలయంలో ఈ నెల 17న రాముల వారికల్యాణం జరిగిన సందర్భంగా ఆదివారం విశేష అన్నదాన ఒకార్యక్రమాన్ని శ్రీ కోదండ రామాలయంలో నిర్వహించారు.దీనికిఅనేకమంది భక్తులు హాజరై స్వామి వారి అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కోదండ రామాలయం ఆలయ కమిటీసభ్యులు ఎస్. పవన్‌కుమార్, కొట్టు శ్రీనివాసరావు, పీటీ రామారావు, జి.రవి,మంచి శెట్టి కృష్ణసింహాచలంతదితరులు పాల్గొన్నారు.

సిరిగిందలపాడులో వైద్యశిబిరం

రంపచోడవరం, ఏప్రిల్ 28: రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో సిరిగిందపాడులో వైద్యశిబిరంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందాజీ తెలిపారు. శిబిరంలో వైద్యులు టీవీ సుబ్బారావు, దాసరి ఉమామహేష్, రాయుడు శ్రీనివాస్, ఎస్.సంపత్‌కుమార్‌లు సుమారు 100 మందికి వైద్యసేవలు అందించారు. 48 మందికి రక్తపరీక్షలు, ఆరుగురికి థైరాయిడ్ పరీక్షలు, ముగ్గురికి ఫిజియోథెరపీ, 8 మందికి ఎక్స్‌రేలు చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో రామకృష్ణమిషన్ అందిస్తున్న వైద్యసేవను సద్వినియోగం చేసుకోవాలని రామకృష్ణ మిషన్ మేనేజన్ స్వామి రఘువీర నంద మహరాజ్ తెలిపారు.

రాజమహేంద్రవరం రూపురేఖలు మారుస్తా

● నగరాన్ని ఐటీ హబ్‌గా మారుస్తాం ● ప్రతీక్షణం ప్రజలకే అంకితం
● టీడీపీ-జనసేన-బీజేపీ ఆత్మీయ సమావేశంలో అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28: వైసీపీ పాలకులు రాజమహేంద్రవరాన్ని గత ఐదేళ్లుగా అస్తవ్యస్తం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక నగరవైభవాన్ని ఇనుమడింపచేస్తూ మోడల్ సిటీగా అభి వృద్ధి చేస్తానని టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నా రు. రాజమహేంద్రవరం తుమ్మలావ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు వద్ద ఆదివారం రాత్రి టీడీపీ డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు యాళ్ళ ప్రదీప్ ఆధ్వర్యంలో జరిగిన టీడీపీ-బీజేపీ-జనసేన ఆత్మీయ సమావేశంలో ఆయన, జనసేన సిటీ ఇంచార్జీ అనుశ్రీ సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి తనయుడు దగ్గుబాటి హితేష్ చెంచురామ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా తొలుతు అనుశ్రీ, హితేష్‌లు మాట్లాడారు. ఆదిరెడ్డి శ్రీనివాస్ అందరివాడని ప్రజలకు కష్టం అంటే ముందుంటాడన్నారు. ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే రాజమహేంద్రవరాన్ని సమగ్ర అభివృద్ధి చేస్తారన్నారు. అనంతరం ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజలను దోచుకుందన్నారు. గత ఐదేళ్లుగా ప్రజలను నానా రకాలుగా ఇబ్బందులు పెట్టారన్నారు. రాజమహేంద్రవరంలో 2019వరకు లేని బ్లేడు బ్యాచ్‌లు ఇప్పుడు ఎలా వచ్చాయని దానికి కారణం వైసీపీ కాదా అని ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి వచ్చాక యువకులుకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. మెగా డీఎస్సీ తీస్తారన్నారు. రాజమహేంద్రవరాన్ని ఐటీ హబ్‌గా మారుస్తామన్నారు. నిరుద్యోగ భృతి రూ.3000 ఇస్తారని చెప్పారు. 25శాతం కమిషన్ తీసుకుని నగరంలో అనాలోచిత పనులు చేయడంవల్ల నగరంలో ముంపు ప్రాంతాలు పెరిగాయన్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామన్నారు. పర్యాటకంగా అభివృద్ధి చేసి ప్రముఖ పుణ్యక్షేత్రాలను కలుపుతూ ఒక ప్రణాళిక కూడా రూపొందించామన్నారు. నగర ప్రజలను సురక్షితమైన తాగు నీరు సమృద్ధిగా అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చెత్తపై విధించిన పన్నులు, పార్కుల ప్రవేశ రుసుములు రద్దు చేయిస్తామన్నారు. ఎన్నికల్లో తనను, ఎంపీగా దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆదిరెడ్డి వాసును, అనుశ్రీ సత్యనారాయణ, హితేష్ చెంచురామ్‌లను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తంగేళ్ళ బాబి, గొర్రెల సత్యరమణి. కరగాని వేణు, యాళ్ళ వెంకట్రావు, పెద్దఎత్తున టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లింలకు న్యాయం చేసింది చంద్రబాబే : ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు



రాష్ట్రంలో ముస్లిం సోదరులకు న్యాయం చేసింది గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో తమ నేత చంద్రబాబే అని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. మసీదుల అభివృద్ధికి షాదీఖానాలకు నిధులు కేటాయించింది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. పవిత్ర రంజాన్‌మాసంలో సోదరుల కుటుంబాలకు రంజాన్ తోఫాను అందించిందన్నారు. రాజమహేంద్రవరంలో మసీదులు, షాదీఖానాలు అభివృద్ధి తాము కృషి చేశామన్నారు. రెహ్మత్‌నగర్‌లో షాదీఖానా నిర్మాణానికి రూ.67,37, 453, నెహ్రూనగర్ ఈద్గాకు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.20,32,549, మెయిన్ రోడ్డులో ముస్లింల బరియల్ గ్రౌండ్ అభివృద్ధికి రూ.15లక్షలు, జైలువార్డర్స్‌వద్ద ఉన్న ఆయేషా షాదీఖానా అభివృద్ధి కోసం రూ.25లక్షలు, అప్సరా థియేటర్ వెనుక ఉన్న హజరత్ వల్లీ జల్ జలీహ్ షాదీఖానా అభివృద్ధి కోసం రూ.25లక్షలు, దానవాయిపేట మదీనా షాదీఖానా అభివృద్ధి కోసం రూ.20లక్షలు, అదేప్రాంతంలో నూతనంగా షాదీఖానా నిర్మాణంకోసం రూ.50లక్షలు నిధులు కలిపి మొత్తం రూ.2,22,702 నిధులు మంజూరు చేయించానన్నారు. టీడీపీ హయాంలో రెహ్మత్ నగర్‌లో షాదీ ఖానాకు రూ.63 లక్షల మైనార్టీ వెల్ఫేర్ నిధులు, రూ.25 లక్షలు ఎంపీ నిధులు విడుదల చేసి కార్పొరేషన్ కమిషనర్ వారి ఖాతాకు జమచేయగా దాని నిర్మాణం చేపట్టేందుకు టెండర్లు పిలిచామని దాని నిర్మాణ పనులు ముందుకు సాగకుండా జగన్ ప్రభుత్వం ఆపేసిందన్నారు. ఎన్నికల్లో రాజమహేంద్రవరం సిటీ కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న తన కుమారుడు ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను, ఎంపీగా పోటీ చేస్తున్న దగ్గుబాటి పురందేశ్వరిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మే 1న పింఛన్ల పంపిణీ

సచివాలయాలకు రావద్దు :కలెక్టర్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మే 1నుంచి 5 తేదీ వరకు సామాజిక భద్రత పింఛన్లు అందజేయడానికి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ మాధవీలత పేర్కొన్నారు. దివ్యాంగులు, అనారోగ్య కారణాలవల్ల మంచానికే పరిమితమైనవారు, సైనిక కుటుంబాలు తదితర ప్రత్యేక కేటగిరీలకు ఇంటి వద్దకే పింఛను పంపిణీ ఉంటుందన్నారు. మిగితా వారికి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారన్నారు. బ్యాంక్ ఖాతాలు లేనివారికి సచివాలయ సిబ్బంది ఇంటికి తీసుకువచ్చి పంపిణీ చేస్తారన్నారు. పింఛన్ల కోసం ఎవరూ సచివాలయాలకు రావద్దన్నారు. మే1న సెలవు దినం అయినప్పటికీ చెల్లింపులు జరిగేలా రాష్ట్రస్థాయి అధికారులు, రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయం తీసుకుంటుందని ఆమె వివరించారు.

ఘనంగా శ్రీవిజయదుర్గాంబిక ఆలయ 31వ వార్షికోత్సవం

రంగంపేట, ఏప్రిల్, 28: మండలంలోని రంగంపేట గ్రామ ఇలవేల్పు శ్రీవిజయదుర్గాంబిక ఆలయ 31వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కోడూరి వెంకటరత్నం, నారాయణశర్మలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 5 వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గారపాటి వీరవెంకటరావు, అబ్బన్న ఉండవిల్లి పద్దరాజు పాల్గొన్నారు.

జిల్లాలో హోమ్ ఓటింగ్ కోసం 69 బృందాలు ఏర్పాటు

● జిల్లా ఎన్నికల అధికారిణి డాక్టర్ మాధవీలత



రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28: జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో హోమ్ ఓటింగ్‌కోసం ప్రత్యేకంగా 69 బృందాలు ఏర్పాటుచేశామని జిల్లా ఎన్నికల అధికారిణి డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. 85 ఏళ్ల నిండిన వృద్ధులు, దివ్యాంగులు వారి ఓట్లను వారివారి ఇళ్ల వద్దే వేసేవిధంగా చర్యలు తీసుకున్నామనారు. అందుకోసం 400 మంది సిబ్బందిని నియమించామన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 85 ఏళ్ల నిండిన వృద్ధులు 8294 మంది, 40 శాతం దివ్యాంగత్వం కలిగిన 19754 మంది ఓటర్లు ఉండగా వారికి ఫారం 12 డీ పంపిణీ చేశామన్నారు. అందులో 85 ప్లస్ కేటగిరిలో 648, పీడబ్ల్యూడీ కేటగిరిలో 658 మంది, ఫారం 12డి అందజేసినట్లు తెలిపారు. హోం ఓటింగ్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 69 రూట్స్ ద్వారా ఆయా ఎన్నికల సిబ్బంది తొలివిడతగా మే 2న, రెండవ విడతగా మే 8న క్షేత్ర స్థాయిలో పర్యటన చేయనున్నట్లు తెలిపారు. ఈమేరకు ఓటర్లకు ముందస్తుగా సమాచారం ఇవ్వ నున్నట్లు తెలిపారు. అనపర్తి నియోజకవర్గ పరిధిలో 85 ప్లస్ వారు 186 మంది, దివ్యాంగులు 222 మంది ఉన్నారు. రాజానగరం పరిధిలో 85 ప్లస్ వారు 33 మంది, దివ్యాంగులు 67 మంది ఉన్నారని, రాజమహేంద్రవరం సిటీలో 85 ప్లస్ వారు 142మంది, దివ్యాంగులు 65 మ ంది ఉన్నారని, రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో 85 ప్లస్ వారు 51 మంది, దివ్యాంగులు 56 మంది ఉన్నారని, కొవ్వూరులో 85 ప్లస్ వారు 66 మంది, దివ్యాంగులు 66 మంది ఉన్నారని, నిడదవోలులో 85 ప్లస్ వారు 130 మంది, దివ్యాంగులు 145 మంది ఉన్నారని, గోపాలపురంలో 85 ప్లస్ వారు 40 మంది, దివ్యాంగులు 37 మంది ఉన్నారని వారి కోసం హోమ్ ఓటింగ్ బృందాలు, సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు.

ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి

● జిల్లా ఎన్నికల పరిశీలకుడు బలరామ్‌మీనా


బిక్కవోలులో పోలీసులకు సూచనలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు బలరామ్‌మీనా

బిక్కవోలు, ఏప్రిల్ 28: సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని జిల్లా పోలీసు ఎన్నికల పరిశీలకుడు బలరామ్‌మీనా పోలీసులకు సూచించారు. ఆదివారం ఆయన బిక్కవోలు కెనాల్‌రోడ్‌లో వంతెనవద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. ఈసందర్భంగా అనపర్తి సర్కిల్ పరిధిలో అనపర్తిలో రూ.94వేలు, రంగంపేటలో 22.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సీఐ శివగణేష్ ఆయనకు వివరించారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఎటువంటి పత్రాలు లేకుండా రూ.50వేలకు మించిన నగదును, బిల్లులు లేకుండా వున్న గిఫ్ట్ ఆర్టికల్స్, మద్యం వంటి వాటిని సీజ్ చేయాలన్నారు. ఈయన వెంట రాజమహేంద్రవరం డీఎస్పీ కిషోర్‌కుమార్, బిక్కవోలు ఎస్ఐ పి.బుజ్జిబాబు ఉన్నారు.

పెన్షనర్లను మోసం చేసిన వైసీపీని ఓడించాలి

● గోరంట్ల సమక్షంలో కరపత్రాలు విడుదల


కరపత్రాలను విడుదల చేస్తున్న గోరంట్ల, పెన్షనర్ల సంఘం నాయకులు

కడియం/రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్ 28: చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఉన్న తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల కూటమిని గెలిపించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను పెన్షనర్లను సామాన్య ప్రజానీకాన్ని నడ్డివిరిచిన జగన్ ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించాలని అఖిలభారత రాష్ట్ర పెన్షనర్ల సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్‌జీవోల సంఘం మాజీ అధ్యక్షుడు జి.పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. అలిండియా పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్‌జీవోల సంఘం మాజీ అధ్యక్షుడు జి.పూర్ణచంద్రరావు, రాష్ట్ర సచివాలయ సంఘం మాజీ అధ్యక్షుడు గురువయ్య, రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ ఎన్‌జీవోల సంఘం మాజీ అధ్యక్షుడు విజ్‌డమ్ చౌదరి, జిల్లా మాజీ అధ్యక్షుడు ఆచంట రామరాయుడుల సమక్షంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి ద్వారా కరపత్రాలు విడుదలచేసి పంపిణీ చేశారు. ఈ కరపత్రాల ద్వారా వైసీపీకి వ్యతిరేకంగా ఓటువేసి కూటమిని బలపర్చాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఒకటో తేదీన పెన్షన్ పడక టెన్షన్ పడుతూ 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఎదురుచూస్తున్న పెన్షనర్లను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెన్షనర్లకు చెల్లించాల్సిన పీఆర్‌సీ, డీఏ, జీపీఎఫ్ మెడికల్ బిల్లులు ఇవ్వకుండా ఉన్నమొత్తం రూ. 30 వేల కోట్లు అన్నారు. ప్రశ్నించే ఉద్యోగులపై కేసులు పెట్టి జైలు పాలు చేస్తున్న జగన్‌ను ఇంటికి సాగనంపాలని ఓటు అనే ఆయుధంతో అరాచక పాలనకు బుద్ధి చెప్పాలని అన్నారు.

కాంగ్రెస్ రావాలి.. బతుకులు మారాలి..

» కాంగ్రెస్ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు


అన్నపూర్ణంపేటలో ఓట్లు అభ్యర్థిస్తున్న గిడుగు, బోడా

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28: కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తేనే రాష్ట్రంలో పేద, సామాన్య మధ్యతరగతి ప్రజల బతులు మారతాయని కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. ఆదివారం సాయంత్రం రాజమహేంద్రవరం అన్నపూర్ణంపేటలో ఆయన, సిటీ అభ్యర్థి బోడా వెంకట్‌తో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు వారికి స్వాగతం పలికి అక్కడి సమస్యలను వివరించారు. రైల్వేగేటును ఆనుకుని వున్న నివాసాల మహిళలు వారికి కనీస సౌకర్యాలు లేవని గిడుగు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కారమై నగరం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి మైనార్టీలు మద్దతు ప్రకటించారు. తొలుత ఉదయం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో వాకర్స్‌ను గిడుగు, బోడా కలిసి కాంగ్రెస్ పార్టీ 9 గ్యారెంటీలపై కరపత్రాలను అందించారు. కార్యక్రమాల్లో పీసీసీ అధికార ప్రతినిధి కొవ్వూరి శ్రీనివాస్, కాటం రవి, బెజవాడ రంగా, చింతాడ వెంకటేశ్వరావు, బత్తిన సుబ్బారావు, రౌతు విజయలక్ష్మి, శెట్టి ప్రతాప్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

బీసీల కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తున్నాం

● తూర్పుకాపుల సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28: బీసీలను ఉపయోగించుకుని అణదొక్కింది జగన్ అయితే బీసీల ఆత్మగౌరవం కోసం ప్రత్యేక రక్షణచట్టం తీసుకు వస్తాన్న నాయకుడు చంద్రబాబు అని రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం మోరంపూడిలోని గన్నిస్ శుభమస్తులో ఆదివారం రాత్రి జరిగిన తూర్పుకాపుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో నా బీసీలు అంటూ బీసీ సోదరులను నమ్మబలికి వారి చేత ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక బీసీలపై ఉక్కుపాదం మోపారన్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు తగ్గించడం వలన అనేక పదవులు, పథకాలు కోల్పోయారని అన్నారు. బీసీ రక్షణ చట్టాన్ని చంద్రబాబు తీసుకువస్తున్నారని రాబోయే ఎన్నికల్లో కూటమిని గెలిపించాలని కోరారు. అనంతరం బీసీలంతా గోరంట్లను సత్కరించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు, తూర్పుకాపు సంఘం నాయకులు మజ్జి రాంబాబు, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, మచ్చేటి ప్రసాద్, మార్నివాసు పాల్గొన్నారు.

క్రైస్ట్ వర్షిప్‌లో అభ్యర్థి నల్లమిల్లి, మాజీ మంత్రి కేఎస్ జవహర్ ప్రార్థనలు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28: రాజమహేంద్రవరం క్రైస్ట్ వర్షిప్‌లో అనపర్తి ఎన్‌డీఏ అభ్యర్థి నల్లమిల్లి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి కేఎస్ జవహర్, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి తనయుడు దగ్గుబాటి హితేష్ చెంచురామ్‌లు ప్రార్థనలు చేశారు. ఆదివారం చర్చ్‌కు వచ్చిన వారికి అంతర్జాతీయ సువార్తీకుడు క్రైస్ట్ వర్షిప్ నిర్వాహకులు జాన్ వేస్లీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొవ్వూరు నియోజకవర్గం వేగేశ్వరపురంలో గోదావరి మేరీమాత పుణ్యక్షేత్రం చర్చ్‌లో ప్రార్థనల్లో వారు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీ సెట్ పరీక్షలు

రాజానగరం, ఏప్రిల్ 28 : ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలిజిబులిటీ టెస్ట్(ఏపీ సెట్) పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. గైట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో 900 మంది అభ్యర్థులకుగానూ 724మంది అభ్యర్థులకు పరీక్షలకు హాజరయ్యారు. 176 మంది పరీక్షలకు హాజరుకాలేదని చీఫ్ సూపరింటెండెంట్ దయానందకుమార్ తెలిపారు.

●మండలంలో తూర్పుగోనగూడెం లోని ఐఎస్‌టీఎస్ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రంలో 750 మంది అభ్యర్థులకుగానూ 604 మంది ఏపీసెట్ పరీక్షలకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ వై.రాజశ్రీరావు తెలిపారు. 146 మంది పరీక్షలకు హాజరుకాలేదన్నారు.

పాపికొండలకు నాలుగు బోట్లు

దేవీపట్నం, ఏప్రిల్ 28: గోదావరి నదీ తీరాన ఉన్న పాపికొండల అందాలను తిలకించేందుకు రాష్ట్రాల నలుమూలల నుంచి పాపికొండల విహారయాత్రకు నాలుగు బోట్లలో సుమారు 200 మంది పర్యాటకులు ఆదివారం వెళ్లారు. పోశమ్మగండి వద్ద ఉన్న బోట్ పాయింట్ నుంచి గోదావరి పరీవాహక ప్రాంతాలైన పూడిపల్లి, దేవీపట్నం, మంటూరు, కొండమొదలు తదితర గ్రామాల మీదుగా పేరంటాలపల్లి వెళ్లి గోదావరి అందాలు తిలకించారు.

వైసీపీ పాలనలో అన్నివర్గాలకు కష్టాలే

● టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల


జేగురుపాడులో ప్రచారం నిర్వహిస్తున్న గోరంట్ల


గోరంట్లను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం


టీడీపీలో చేరిన వారితో గోరంట్ల, ఆయన కుమార్తె శిరీష

కడియం/రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్ 28: వైసీపీ ఐదేళ్ల పాలనలో రైతాంగంతో పాటు అన్ని వర్గాల ప్రజలు అనేకకష్టాలు పడ్డారని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. ఆదివారం జేగరుపాడులో గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆయన కుమార్తె కంఠమనేని శిరీష, సీనియర్ టీడీపీ నాయకులు గారపాటి అమరనాద్‌తో కలిసి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామంలో అతి సుందరంగా నిర్మించిన పార్టీ కార్యాలయాన్ని గోరంట్ల ప్రారంభించారు. పలువురు పార్టీలో చేరారు. వారికి గోరంట్ల పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గోరంట్ల మాట్లాడుతూ రైతాంగాన్ని ఆదుకోలేని స్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. వైసీపీ ఐదేళ్లలో చేనేత కార్మికుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందన్నారు. వారితోపాటు అనేక వృత్తులు వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. కొత్త రహదారులు మాట ఎలాఉన్నా కనీసం రహదారులు మరమ్మతులు కూడా లేవన్నారు. మండలంలో ప్రధానంగా డ్రైనేజీ సమస్య ఉందన్నారు. గ్రామాల్లో మురుగునీరు పోయే విధంగా ప్రణాళికలు చేసి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కూటమి అధికారంలోకి రాగానే ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, మండలంలో మాధవరాయుడుపాలెం గ్రామంలో 15వేల ఇళ్ల నిర్మాణం చేసి ఇల్లులేని ప్రతీ పేదవానికి ఇల్లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గారపాటి అమరనాద్, పాతూరి రాజేష్, నాగిరెడ్డి రామకృష్ణ, ఆకుల శ్రీధర్, ప్రత్తిపాటి రామారావుచౌదరి, గెడ్డం శివ, కర్రి చినబాబు, మర్రెడ్డి రమేష్, వల్లూరి మోహన్, వనమాలి బాలాజీ, కొమ్మరవత్తుల సూర్యకుమార్, నాగులపల్లి వీరబాబు, చిక్కాల శ్రీను, గారపాటి తాతబ్బాయి, ఉండమట్ల ప్రభాకర్, రామచంద్రరావు, వాసాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. నాగిరెడ్డి దొరబాబు, వనమాలి శ్రీను, వాకలపూడి అరుణకుమార్, నూకపెయ్యి ప్రసాద్, పల్లపు రాజేష్, చిన్నం ప్రసాద్, బచ్చల కిరణ్, కె పవన్, పల్లపు అజయ్, పెనుమాటి పవన్, పెనుమాటి అవినాష్, తాడి సతీష్ లతో పాటు పలువురు యువత పార్టీలో చేరారు.

కాతేరులో టీడీపీ సమావేశం

రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడును మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ తెలిపారు. రూరల్ మండలం కాతేరులో సీనియర్ నాయకులు గంగిన హనుమంతరావు ఆధ్వర్యంలో టీడీపీ-జనసేన-బీజేపీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన గన్ని కృష్ణ మాట్లాడుతూ ఒకసారి చేసిన తప్పును మరోసారి చేయకుండా రానున్న ఎన్నికల్లో చంద్రబాబు నాయకత్వాన్ని ప్రతీఒక్కరూ బలపరచాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బూత్‌కమిటీ సభ్యులు, ఇన్‌చార్జులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, రూరల్ నాయకులు బిక్కిన సాంబ పాల్గొన్నారు.







వైసీపీ నాయకుల తాట తీస్తా : జగ్గంపేట సభలో ఆవేశంగా మాట్లాడుతున్న పవన్



ఓటర్లూ గుర్తుపెట్టుకోండి : ప్రత్తిపాడులో పవన్‌తో కలిసి గాజు గ్లాసు, సైకిల్ గుర్తులు చూపుతున్న ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థిని సత్యప్రభ

నేను ఇక్కడే ఉన్నా : కిర్లంపూడి సభలో జనానికి వంగి అభివాదం చేస్తున్న పవన్ కల్యాణ్

అండగా నేనుంటా..



మీ ఓటు జ్యోతిలా వెలగాలి : కిర్లంపూడి సభలో పవన్ పక్కన నిలబడి మాట్లాడుతున్న జ్యోతుల నెహ్రూ.. చిత్రంలో ఉదయ్‌శ్రీనివాస్, నవీన్ తదితరులు



అన్నొచ్చాడు : జగ్గంపేట రోడ్ షోలో పవన్‌కు జైకొడుతున్న అభిమానులు



జయహో పవన్ : ప్రత్తిపాడు రోడ్ షోలో అభిమానుల ఉత్సాహం

ప్రత్తిపాడు, జగ్గంపేట వారాహి యాత్రలో పవన్‌కల్యాణ్

- మైనింగ్ మాఫియా ఆట కట్టిస్తా
- నాకు అన్ని కులాలు సమానమే
- సమస్యల పరిష్కారంపైనే దృష్టి
- ప్రతి చేతికి పని.. ప్రతి చేనుకు నీరే లక్ష్యం

ఏలేశ్వరం/ జగ్గంపేట/ జగ్గంపేట రూరల్/ కిర్లంపూడి, ఏప్రిల్ 28 : మైనింగ్‌ను అక్రమంగా దోచేందుకే ప్రత్తిపాడు నియోజకవర్గంపై వైసీపీ నాయకులు కన్నువేశారని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరంలో ఆదివారం నిర్వహించిన జనసేన బహిరంగ సభలో పవన్ మాట్లాడారు. ప్రత్తిపాడు మండలంలో లేటరైట్ పేరుతో బాక్సైట్‌ను తరలించుకుపోతున్నారన్నారు. మాఫియా డాన్ కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి తమ్ముడు లంపకలోవలో ఉన్న వీరభద్ర కంపెనీకి అనువుగా రోడ్లు, బ్రిడ్జి నిర్మించుకున్నారుకానీ నియోజకవర్గంలో ఉన్న రోడ్లను, ప్రజల సమస్యలను నిర్లక్ష్యంగా వదిలేశారన్నారు. ఏలేరు ప్రాజెక్టు, సుబ్బారెడ్డిసాగర్, చంద్రబాబు సాగర్‌లను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే వంతాడ అక్రమ మైనింగ్ ఆపుతానన్నారు. పెద్దమల్లాపురం కేంద్రంగా ప్రత్యేక మండలాన్ని ఏర్పాటుచేసి గిరిజనులకు మేలు చేస్తానన్నారు. 72 ఎయిడెడ్ స్కూల్స్ కళాశాలలను తీసేసిన ఘనత జగన్ ప్రభుత్వానిదేనన్నారు. ఎయిడెడ్ పాఠశాలలను కూటమి ప్రభుత్వంలో పునరుద్ధరిస్తామన్నారు. కాకినాడ జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో ప్రజలకు అండగా ఉంటానన్నారు. దళితుడైన డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హత్యచేసి డోర్ డెలివరీ చేసిన అనంతబాబుకు సీఎం ప్రాధాన్యం ఇవ్వడం పలు అనుమానాలను రేకెత్తిస్తోందన్నారు. జగన్ పార్టీ తరఫున ఎంపీ అభ్యర్థిగా ఉన్న చలమలశెట్టి సునీల్‌ను ఓటర్లు నిలదీయాలన్నారు. కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి నీడను కూడా ప్రత్తిపాడుపై పడనీయబోయనని స్పష్టంచేశారు. కూటమి అధికారంలోకి వస్తే ప్రతి కార్పొరేషన్‌కు పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తామన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా వరుపుల సత్యప్రభ, గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను గెలిపించాలన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ మాట్లాడుతూ నిత్యపోరాటయోధుడు పవన్‌కల్యాణ్ నీతికి నిలబడే వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మీసాల రాజు, గాటా బాలుదొర, బాబి తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట అభివృద్ధికి కృషి

ప్రతి చేతికి పని, ప్రతి చేనుకు నీరందించడమే ముఖ్య లక్ష్యమని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. జగ్గంపేట నియోజకవర్గ సమస్యలపై కిర్లంపూడిలో నిర్వహించిన వారాహి సభలో పవన్ మాట్లాడారు. 'మల్లవరం ప్రాజెక్టుకు రూ.132 కోట్లు అంచనా వేసి రెండుసార్లు శంకుస్థాపన చేసి కూడా ప్రభుత్వం నిధులు ఇవ్వలేదన్నారు. పుష్కర ఎత్తిపోతల పథకం నిర్వీర్యమైపోయిందన్నారు. పోలవరం మట్టి గట్లను తవ్వేస్తున్నా జలవనరులశాఖ చోద్యం చూస్తుందని మండిపడ్డారు. కిర్లంపూడి మండలం బూరుగుపూడి 175 ఎకరాల దుస్సాం చెరువును వైసీపీ ప్రతినిధులు ఆక్రమించేశారని తెలిపారు. గోకవరంలో పంచాయతీ స్థలాల్లో లాడ్జిలు నిర్మించారన్నారు. వైసీపీ శ్రేణులు రామేశ్వరంమెట్ట మట్టి తరలించుకుపోయి కోట్లాది రూపాయలు వెనకేసుకున్నారన్నారు. పుష్కర ఎత్తిపోతల పథకం నీరురాక 30 వేల ఎకరాలు ఎండితున్నా కనీస స్పందన లేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక కిర్లంపూడికి డిగ్రీ కాలేజీ తెస్తాం. ఏలేరు ఆధునికీకరణ చేస్తాం. మల్లవరం సాగునీటి ప్రాజెక్టు పూర్తిచేస్తాం' అని స్పష్టంచేశారు. జగన్ గత ఎన్నికల్లో కాపులకు రిజర్వేషన్ ఇవ్వలేనని చేతులెత్తేశారని, అప్పుడు జగన్‌ను అడగలేకపోయారని, ఈ డబ్ల్యూసీ పథకం కింద టీడీపీ ఐదు శాతం ఇస్తే దాన్నీ వైసీపీ తుంగలోకి తొక్కిందన్నారు. ఇక్కడ ఉద్యమ నాయకులు సినిమాల్లో రంగులేసుకునే వారని హేళన చేస్తున్నారు తప్పితే కాపులకు మంచి చేస్తే ఆనందపడేవాడినన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని కులాలకు సమన్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.



పవన్‌కు పూలమాల వేస్తున్న నేతలు



ప్రత్తిపాడు సభకు హాజరైన జనం

కూటమి ప్రభుత్వం రాగానే సమస్యలు పరిష్కరిస్తా

కాకినాడ ఎంపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

జనసేన పార్టీ అంటే జెండా కాదు.. అజెండా ఉన్న పార్టీ. ప్రత్తిపాడు నియోజకవర్గంలో మైనింగ్, రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటి సమస్య అధికంగా ఉంది. కాకినాడ పోర్టు అభివృద్ధి చేయరు, రైల్వే జోన్ పట్టించుకోరు. సెజ్ భూములను చిత్తశుద్ధితో పట్టించుకుని పరిశ్రమలు తీసుకొస్తే ఆరు లక్షల మందికి ఉద్యోగం కల్పించవచ్చు. సెజ్ భూములను రియల్ ఎస్టేట్‌లా వాడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలను నెరవేరుస్తాను.

యువత భవిష్యత్ కోసమే పవన్ ఆరాటం..

ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సత్యప్రభ

రాష్ట్రం కోసం, రాష్ట్రంలో ఉన్న యువత భవిష్యత్ కోసం అండగా నిలబడి కూటమి గెలుపు కోసం పవన్‌కల్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారు. నా భర్త రాజా మరణం అనంతరం అండగా నిలిచి ధైర్యం చెప్పిన చంద్రబాబు రుణం తీర్చుకోలేనిది. కూటమి అభ్యర్థిగా నన్ను గెలిపించడానికి నాకు మద్దతు ఇచ్చిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో సుబ్బారెడ్డిసాగర్, చంద్రబాబు సాగర్ ఆధునికీకరణ పనులు జరగక రైతులకు నీరు అందడం లేదు. అధికారంలోకి రాగానే సమస్యల్నీ పరిష్కరిస్తాం.

త్యాగశీలి పవన్‌కల్యాణ్

జగ్గంపేట అభ్యర్థి జ్యోతుల నెహ్రూ

విజన్ ఉన్న చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారనే నమ్మకంతో ఉమ్మడిగా ఆయన్ను సీఎం చేయడానికి మూడు పార్టీల మద్దతు ఉంది. తనకున్న బలాన్ని తగ్గించుకున్న వ్యక్తి పవన్‌కల్యాణ్. సంక్షేమం, అభివృద్ధి అందించడం కోసం ఒక త్యాగశీలిగా నిలిచారు. పవన్‌కల్యాణ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలి. నియోజకవర్గ అభివృద్ధికి ఎన్నో ప్రాజెక్టులు తీసుకువచ్చి వ్యవసాయంతో పాటు నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తాను. పొలాలకు సాగునీటి కొరత లేకుండా చేసి సస్యశ్యామలం చేస్తా.



డిగ్రీలు చదువుకుని.. పొట్ట చేతపట్టుకుని..!

నిరుద్యోగుల జీవితాలతో ఐదేళ్లూ జగన్ ఆటలు

- జాబ్ క్యాలెండర్‌పై మాట తప్పారు
- విడుదలకాని నోటిఫికేషన్లు
- ఐదేళ్లూ సర్కారీ కొలువుల్లేవ్
- మెగా డీఎస్సీ పేరుతో వంచన
- పరిశ్రమలు పడక..75 శాతం ఉద్యోగాల్లేవ్
- వలంటీర్ 'సేవ'ను ఉద్యోగాలుగా బడాయి
- ఇంజనీరింగ్ చదివి ఇంట్లోనే కాలక్షేపం
- వైసీపీ పాలనలో యువతకు దగా
- 20 లక్షల ఉద్యోగాలంటూ కూటమి వరం

'డిగ్రీలు పుచ్చుకొని.. పొట్ట చేతపట్టుకుని' ఈ మాటలు ఎక్కడో విన్నట్టు ఉన్నాయి కదూ.. ఆకలిరాజ్యం సినిమాలోని సూపర్‌హిట్ పాటలో ఒక లైన్ ఇది.. ఈ ఐదేళ్లు జగన్ ప్రభుత్వం ఈ మాటను నిజం చేసింది.. యువతకు ఉద్యోగాల్లేవ్.. చిన్నా చితక ఉద్యోగాలు తప్ప చదువుకు తగిన ఉద్యోగాల ఊసేలేదు.. జగన్ ప్రభుత్వంలో యువత దగా పడ్డారు. జాబ్ క్యాలెండర్ అంటూ గత ఎన్నికల సందర్భంగా జగన్ డాబు కబుర్లు చెప్పారు. వాటిని నమ్మిన యువత నోటిఫికేషన్లకు ఎదురు చూపులతోనే ఐదేళ్లు ఆవిరైపోయాయి. వారి వయసుకు ఐదేళ్లు జమయిపోయింది.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో యువత ఆశలు నీరుగారిపోగా.. నిరుద్యోగం కోరలు చాచింది. డిగ్రీలు చదివి ఇంట్లో ఉండిపోయిన పిల్లలను చూస్తూ తల్లిదండ్రులు ఆవేదనకు గురయ్యారు. జగన్ సీఎం పీఠమెక్కిన తర్వాత సర్కారీ కొలువులకు ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదు. వలంటీర్ల 'సేవ'ను ఉద్యోగాల జాబితాలో కలిపేసుకుని లక్షల ఉద్యోగాలు ఇచ్చామంటూ ఐదేళ్లు కాలక్షేపం చేసేశారు. జాబ్ మేళాలంటూ యువతను వంచన చేశారు. మెగా డీఎస్సీ పేరుతో 'గాలి' ప్రకటన తెరపైకి తెచ్చి యువతను మరింత మనోవేదనలో ముంచేశారు. ఐదేళ్ల పాటు యువతను వేధించిన సీఎంగా జగన్ మరో ఘనత సాధించారు.కూటమి 20 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పడంతో యువతలో నూతనోత్సాహం కనిపిస్తోంది.గత చంద్రబాబు హయాంలో పెద్ద సంఖ్యలో ఉపాధి పొందిన చరిత్రను ఉద్యోగార్థులు గుర్తు చేసుకుంటున్నారు.

మెగా డీఎస్సీ .. 390 ఉద్యోగాలు..

ఐదేళ్లుగా ఎప్పుడెప్పుడా అని యువత ఎదురు చూసిన డీఎస్సీ నోటిఫికేషన్ ఎన్నికల ఎత్తులో భాగంగా పరుగు పరుగున వచ్చేసి మెగా పేరుతో భావి ఉపాధ్యాయులను దగా చేసింది. ఖాళీలు బ్లాక్ బోర్డంత ఉండగా భర్తీల సంఖ్య మాత్రం చాకోపీసంత కూడా లేదు. ఎన్నికల వేళ ఓ నోటిఫికేషన్‌ను హడావుడిగా తెరపైకి తీసుకొచ్చి యువతను మోసం చేశారు. గత ఎన్నికల ముందు ఓట్ల కోసం మెగా డీఎస్సీ అని ఊదరగొట్టిన జగన్‌కి మళ్లీ ఎన్నికల సమయానికి గానీ ఉద్యోగార్థుల ఆవేదన వినిపించలేదు. ఉమ్మడి తూర్పుగోదావరిని పరిగణనలోకి తీసుకొని డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో సుమారు 2 వేలపైనే ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఉన్నాయి.జగన్ ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరుతో కేవలం 390 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎన్నికల షెడ్యూల్‌కి నెలముందు ప్రభుత్వం డీఎస్సీని ప్రకటించింది. ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 20 రోజులు సమయం ఇచ్చి తర్వాత 10 రోజులకే డీఎస్సీ అన్నారు.అంత తక్కువ సమయంలో అభ్యర్థులు రెం డింటికీ ఎలా సన్నద్ధమవుతారని పాలకులు ఆలోచించలేదు. ఒక పక్క పోస్టులు తక్కు వగా ఉండడం..మరో పక్క పరీక్షల షెడ్యూల్‌తో ఉద్యోగార్థులను జగన్ టార్చర్ పెట్టారనడంలో సందేహం లేదు. కొందరు అభ్యర్థులు తమ ఆవే దన చెబుతూ సోషల్ మీడియాలో పోస్టులు కంటనీరు పెట్టించాయి.

జగన్ మార్కు మెలిక

డీఎస్సీ నోటిఫికేషన్‌లోనూ జగన్ మార్కు మెలిక తప్పలేదు. కీలకమైన సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) పోస్టులకు బీఈడీ అభ్యర్థులను అర్హులుగా ప్రకటించి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రక్రియ జాప్యం చేయా లనే పన్నాగం పన్నింది. ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులు అనర్హులని గతంలో సుప్రీంకోర్టు చెప్పింది. జగన్ ప్రభుత్వం ఎస్జీటీ పోస్టులకు బీఈడీ వాళ్లను అర్హులుగా ప్రకటిస్తూ నోటిఫికేషన్ ఇచ్చేసింది. హైకోర్టు మొట్టికాయలతో ఎస్జీటీ పోస్టులకు డీఎడ్ వారిని మాత్రమే అనుమతిస్తామని తెలిపింది.దాంతో ఎస్జీటీ పోస్టుల దరఖాస్తుదారుల పరిస్థితి అయోమయంలో పడింది.

ఉన్నత చదువులు..చిన్న ఉద్యోగమా?

సచివాలయ ఉద్యోగాల పేరుతోను యువతను జగన్ సర్కారు మోసం చేసింది.. ప్రభుత్వ ఉద్యోగమంటూ ప్రచారం చేసింది..పెద్ద పెద్ద చదువులు చదివిని యువత తమ ఉద్యోగాలు మానివేసి సచివాలయ ఉద్యోగాల బాటపట్టారు. ఇప్పుడు ఉండలేక..వచ్చేది సరిపోక..బయటకు వెళ్లలేక సతమతమవుతున్నారు.చంద్రబాబు వస్తే తమకు మంచి దారి చూపుతారని ఎదురుచూస్తున్నారు. వలంటీర్ల వ్యవస్థతో మరి కొంత మంది యువత ఆటలాడుకున్నారు.ఏదో చిన్న ఉద్యోగం ఇచ్చి గ్రామాలకే కట్టిపడేశారు. వలంటీర్లు చేసేది సేవ అని జగన్ పలుమార్లు అన్నారు. యువత జీవితంలో ఐదేళ్లు ఎంత విలువైనదో సీఎం సారుకు తెలియదా పాపం.. కేవలం రూ.5వేలు గౌరవభృతి మాత్రమే ఇచ్చి రాజకీయ అవసరాలకు ఉపయోగించుకోడానికి వలంటీరు వ్యవస్థను తెరపైకి తెచ్చారు.వారితో 'అన్ని' పనులూ చేయించుకున్నారు. చివరికి వారిని అడకత్తెరలో వలంటీరు మాదిరిగా చేసేశారు. ఎన్నికలు వచ్చేసరికి తీసి పక్కన పెట్టేశారు.ఇలా లక్షలాది ఉద్యోగాలు కల్పించామంటూ అంకెల గారడీతో నాలిక మడత పెట్టేశారు జగన్.

చంద్రబాబు వస్తే ఐటీ వస్తోంది..!



నేడు మనం చూస్తున్న హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ చంద్రబాబు విజన్‌కి ప్రతిరూపం. వేలాది మంది ఐటీ చదివిన పిల్లల కలల సాకారానికి నిదర్శనం. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజా వేదికతో మొదలు పెట్టిన విధ్వంసం అమరావతి వరకూ నిరంతరాయంగా కొనసాగింది. 2019లో చంద్రబాబు సీఎం అయి ఉంటే రాష్ట్రానికి చెందిన ఐటీ పిల్లలు వేరే రాష్ట్రాలకు కేవలం రూ.10వేల జీతానికి వలస వెళ్లాల్సిన పరిస్థితి దాపురించేది కాదు. మనకు దగ్గరలోని అమరావతిలో ఉద్యోగం చేసుకునేవాళ్లు. విభజిత రాష్ట్రంలో జగన్ ఐటీ పిల్లల ఉపాధికి ఒక్క ప్రయత్నమూ చేయలేదు. ఏపీలో ఐటీ కొలువు కలగానే మిగిలిపోయింది. దీంతో బెంగళూరు, మద్రాసు, హైదరాబాద్‌కి పిల్లలు వలస వెళ్లక తప్పడం లేదు. ఇప్పుడు మళ్లీ ఐటీ హబ్ అంటూ జగన్ ఊదరగొడుతున్నారు.చంద్రబాబును రాజమండ్రి సెంట్రల్ జైలులో బంధించిన సమయంలో ఐటీ ఉద్యోగులు భారీగా వచ్చారు.వాళ్లనూ వైసీపీ ప్రభుత్వం నిస్సిగ్గుగా అడ్డుకొంది.మలేషియాలో ఐటీ ఉద్యోగం చేస్తున్న ఓ ఉద్యోగి రూ.2లక్షలు ఖర్చు పెట్టుకొని చంద్రబాబును చూడాలని ఆనాడు రాజమండ్రి వచ్చారు.ఇదొక్క ఘటన చాలు చంద్రబాబు విజన్ గురించి చెప్పడానికి. మళ్లీ చంద్ర బాబు వస్తే అమరావతిలో హైటెక్ సిటీ వస్తుందని యువత భరోసాగా ఉండడమే ఆ నమ్మకానికి నిదర్శనంగా నిలుస్తోంది.

స్థానికులకు 75 శాతం ఉద్యోగాలేవి..

జగన్ ప్రభుత్వం వచ్చాక మద్యం పరిశ్రమలను బలవంతంగా వైసీపీ నాయకులు చెరబట్టి వ్యాపారం చేస్తున్నారు. అవి తప్ప కొత్తగా పరిశ్రమలు వచ్చిన దాఖలాలు లేవు. ఐదేళ్లలో యువతకు ఉపాధి కల్పించే విధంగా ఒక్క పరిశ్రమ ఉత్పత్తి ప్రారంభించలేదు. వైసీపీ ప్రభుత్వ విధానాలతో చాలా పరిశ్రమలు పడకేశాయి. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే చూస్తే సుమా రు 10 పరిశ్రమల వరకూ మూతపడ్డాయి. విజ్జేశ్వరం పవర్ ప్లాంట్, వేమగిరిలో జీవీకే, బిక్కవోలు మండలం కానేడులో బ్లూక్రాఫ్ట్ ఆగ్రో ఇండస్ట్రీస్,జీడిపప్పు, నగ్గుబియ్యం పరిశ్రమలు సైతం మూతపడ్డాయి. కాకినాడ, కోనసీమ జిల్లాలో మరిన్ని పరిశ్రమలు సైతం లాకౌట్‌కు గురయ్యాయి.దీంతో సుమారు 50 వేల మంది ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డారు. ఉమ్మడి తూర్పు లో మూడు నాలుగు పరిశ్రమలకు కొబ్బరికాయలు కొట్టినా అంతకుమించి ఒక్క అడుగూ ముందుకు పడలేదు. రాజా నగరం నియోజకవర్గం పరిధిలో ఎన్నికల షెడ్యూల్‌కి ఒక్క రోజు ముందు హడావుడిగా పారిశ్రామికవాడకు శంకుస్థాపన చేశారు.ఈ ఐదేళ్లలో గుర్తుకురాని పరిశ్రమలు, యువతకు ఉపాధి పాలన చివరలో జగన్‌కి ఠక్కున గుర్తొచ్చేశాయి.ఏడాదికి వేలాది మంది ఇంజనీరింగ్, బీఎస్సీ, బీఏ, బీబీఎం, బీకాం వంటి డిగ్రీలు పూర్తి చేసి కళాశాలల నుంచి బయటకు వస్తున్నారు. ఐదేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేక ఇంట్లో కాలక్షేపం చేయక తప్పలేదు.గత ఎన్నికల్లో భాగంగా స్థానిక పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే అనే జగన్ హామీని అటకెక్కించారు. అటు ఉద్యోగాల కల్పన లేక,ఇటు పరిశ్రమలు మూతప డడంతో యువత అల్లాడిపోయారు. కొందరు సెల్‌ఫోను షాపులు, షాపింగ్ మాల్స్, ఆటోమొబైల్ తదితర దుకాణాల్లో అతి తక్కువ జీతానికి విధిలేక పనిచేస్తున్నారు.

కూటమితో ఊతం

గత ఎన్నికల్లో జగన్ ఇచ్చిన హామీలు 'గాలి' మాటలు కావడంతో పెద్ద సంఖ్యలో యువత కుదేలయ్యారు. నోటిఫికేషన్లకు ఎదురు చూడడంతోనే ఐదేళ్లు గడచిపోయాయి. ఇక జగన్ మాటలు నమ్మే స్థితిలో యువత లేదు. ఇప్పుడు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామంటూ భరోసా ఇవ్వడంతో యువతలో మళ్లీ నూతనోత్సాహం కనిపిస్తోంది. చంద్రబాబు హయాంలో పెద్ద సంఖ్యలో వచ్చిన ఉద్యోగాలను వారు గుర్తు చేసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నైపుణ్య శిక్షణ పడకేసింది. నోటిఫికేషను ముఖం చాటేసింది. విదేశాల్లో ఉపాధి ఊసే మరిచిపోయారు.

నేడు అభ్యర్థుల తుది జాబితా విడుదల

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి అర్హత సాధించిన అభ్యర్థుల తుది జాబితా ఎన్నికల అధికారులు సోమవారం సాయంత్రం 3గంటల తర్వాత ప్రకటిస్తారని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డా.కె.మాధవీలత ఆదివారం తెలిపారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకూ జిల్లాలో దాఖలైన నామినేషన్లను శుక్రవారం పరిశీలించిన సంగతి తెలిసిందే. వీటిలో మొత్తం 89 మంది నామినేషన్లు ఆమోదించారు. నామినేషన్లు ఉపసంహరించుకోవడానికి సోమవారం మధ్యాహ్నం 3 గంటల వరకూ గడువు ఉంది. అనంతరం జాబితా అధికారికంగా ప్రకటిస్తారు. జిల్లాలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిగా పోటీచేస్తున్న సంగతి తెలిసిందే. అధికార వైసీపీతో పాటు, కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా పోటీలో ఉంది. ప్రధాన పార్టీలకు గుర్తులు ఎలానూ ఉంటాయి. స్వతంత్రులకు ఇతరులకు గుర్తుల కేటాయింపు కూడా ఉంటుంది.

మే 1 నుంచి బ్యాంక్ ఖాతాలకే పింఛన్

8

నేడు రాజమహేంద్రవరంలో వైఎస్ షర్మిళారెడ్డి రోడ్ షో

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళారెడ్డి సోమవారం రాజమహేంద్రవరం పర్యటనకు వస్తున్నారని ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి బోడా వెంకట్ ఆదివారం తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు, మల్లయ్యపేట, పేపరుమిల్లు రోడ్డు, సీతంపేట, ఆర్యాపురం, ఫైర్ స్టేషన్, త్రీటౌన్ రోడ్డు, పుష్కరాలరేవు మీదుగా రోడ్ షో చేసుకుంటూ సోమవారం సాయంత్రం 5 గంటలకు కోటగుమ్మం సెంటర్‌కు చేరుకుంటారని తెలిపారు. అక్కడ కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారన్నారు. అనంతరం మెయిన్ రోడ్డు మీదుగా విజయటాకీస్ సెంటర్‌కు చేరుకుంటారని అక్కడ కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఇద్దరిని మింగేసిన అతివేగం

కొవ్వూరులో లారీని ఢీకొన్న వ్యాన్

8

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉండ్రాజవరం, ఏప్రిల్ 28: మండలంలోని మోర్త-చిలకపాడు 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో లైన్లు మరమ్మతుల నిమిత్తం ఈనెల 29 తేదీ నుంచి మే 3 తేదీ వరకు ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మండలంలోని చిలకపాడులో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. ఈ పనుల వల్ల భవిష్యత్తులో త్రీఫేస్ విద్యుత్ సరఫరా నిరంతరాయంగా జరుగుతుందని, గ్రామాల్లో లోటల్టేజీ సమ్యలు తగ్గుతాయని ఆయన వివరించారు.

కూటమి అధికారంలోకి వస్తే పింఛను రూ. 4వేలు

టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు



వాడపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, ఏప్రిల్ 28: కూటమి అధికారంలోకి వస్తే పింఛను రూ.4 వేలు చొప్పన అందజేయనున్నట్టు టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వాడపల్లిలో ఆదివారం ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ముప్పిడి మాట్లాడుతూ వైసీపీ మేనిఫెస్టో పేరుతో మాయఫెస్టోను ప్రకటించిందన్నారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు, ఆరాచకాలు, ఇసుక, మట్టి, మద్యం, డ్రగ్స్ మాఫియా విపరీతంగా పెరిగిపోయాయన్నారు. విద్యుత్, బస్సు చార్జీలు, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్యుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్, ఎంపీపీ కాకర్ల నారాయుడు, కాకర్ల బ్రహ్మాజి పాల్గొన్నారు.

చర్చిలు, ఆలయాలను సందర్శించిన మద్దిపాటి



దేవరపల్లిలో ప్రార్థనలు చేస్తున్న మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి, ఏప్రిల్ 28: టీడీపీ-జనసేన-బీజేపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు ఆదివారం పలు దేవాలయాలు, చర్చిలు సందర్శించి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. దేవరపల్లిలోని పార్టీ కార్యాలయంలో టీడీపీ నేతలు, జనసేన నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన బీసీ కాలనీలోని శ్రీకృష్ణ ఆలయంలో పూజలు జరిపారు. స్థానిక నేతలతో ఆయన మాట్లాడారు. లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు సుంకర దుర్గారావు, గన్నమని హరికృష్ణ, కొండపల్లి దొరయ్య, కాట్రు భీమరాజు, గద్దే సుబ్రహ్మణ్యం, ఉప్పులూరి రాంబాబు, శ్రీనివాస్, లక్ష్మీపతిరాజు, తంగెళ్ళ మునేశ్వరరావు, కంబాల సత్తిబాబు, అనిశెట్టి గంగరాజు పాల్గొన్నారు.

కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, ఏప్రిల్ 21: మండలంలోని తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు, క్షీర నివేదన మహానివేదన నిర్వహించారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. ప్రత్యేక దర్శనం, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయాలు, పూజా టికెట్లు ద్వారా రూ.1,38,478 ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. ఆలయ ఆవరణలో ఆదివారం జవ్వాది రామారావు, సత్యవతి దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు 100 లీటర్ల పెరుగును మజ్జిగ చలివేంద్రానికి అందజేశారు.

'పది' విద్యార్థికి మానవత నగదు ప్రోత్సాహకం

నిడదవోలు, ఏప్రిల్ 28: కోరుమామిడి జడ్పీ హైస్కూల్ విద్యార్థి దండుబోయిన రోహిత్ పదో తరగతిలో 574 మార్కులు సాధించాడు. ఈ నేపథ్యంలో ఆదివారం నిడదవోలులోని మానవత సేవా సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రోహిత్‌ను రూ.12 వేల నగదు, మెమోంటోతో సత్కరించినట్టు సంస్థ ప్రతినిధి సుంకవల్లి రాము తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎమ్ వి.లక్ష్మి, ఉప సర్పంచ్ ఉప్పల కాశీ, సంస్థ అధ్యక్షుడు కాజా గంగరాజు పలువులు సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

గోపాలపురం: ఇటీవల అగ్నిప్రమాదానికి గురైన నామాల కల్యాణి, నామాల కార్తీక్ వైద్యం నిమిత్తం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున రూ.12 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. దేవరపల్లి పద్మశ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ అధినేత ముళ్ళపూడి గంగాధరం రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మోడల్ పోలింగ్ కేంద్రం పరిశీలన



మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద సబ్ కలెక్టర్ శ్రీవాత్సవ

తాళ్లపూడి, ఏప్రిల్ 28: తాళ్లపూడి పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ అశితోష్ శ్రీవాత్సవ ఆదివారం సందర్శించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు అధికారులు ఈ కార్యక్రమాన్ని చేట్టారు. మోడల్ పోలింగ్ కేంద్రం పట్ల సబ్ కలెక్టర్ సంతృప్తి వ్యక్తంచేశారు. ఇప్పటికే గ్రామగ్రామాన మాక్ పోలింగ్ నిర్వహించి ఈవీఎంల పట్ల ప్రజలకు అవగాహన కలిగించామని, దీనిలో భాగంగా తాళ్లపూడిలో 22వ పోలింగ్ కేంద్రాన్ని మోడల్ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో సెక్టార్ ఆఫీసర్ నెహ్రూ, పోలింగ్‌స్టేషన్ సూపర్‌వైజర్ అమ్మిరాజు, డీటీ భారతి, సీనియర్ అసిస్టెంట్ సీతారామరాజు, బీఎల్‌వో అంజిబాబు పాల్గొన్నారు.

ఫిన్లాండ్‌లో సీతారాముల కల్యాణం

నల్లజర్ల, ఏప్రిల్ 28: ఫిన్లాండ్ దేశంలో సీతారాముల కల్యాణ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఏటా ఫిన్లాండ్‌లో సీతారాముల కల్యాణం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని ఎన్ఆర్ఐ అడబాల వెంకట ఫణీంద్రకుమార్, శ్రీవల్లి, కంచర్ల నాగవెంకట సత్యనారాయణ, లక్ష్మీమంజూష దంపతులు తెలిపారు. ప్రత్యేక పూజలు చేసి అన్నసమారాధన నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో 400మంది భక్తులు పాల్గొన్నట్టు పేర్కొన్నారు.

ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

దేవరపల్లి, ఏప్రిల్ 28: రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలన్నా, పోలవరం నిర్మాణం పూర్తవ్వాలన్న కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని నియోజకవర్గ అభ్యర్థి మార్టిన్ లూథర్ అన్నారు. దేవరపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి కాంగ్రెస్ పార్టీకి మంచి స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో వెలగా రామకృష్ణ, జ్యేష్ట సతీష్, మటపర్తి రామ్మోహనరావు, దాట్ల హరిబాబు, గన్నమని రామానాయుడు, గుత్తికొండ సూరిబాబు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

ఉండ్రాజవరం, ఏప్రిల్ 28: మండలంలోని వేలివెన్ను గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, ఉపసర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్‌ను, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించాలని సర్పంచ్, ఉపసర్పంచ్ ఓటర్లను అభ్యర్థించారు. టీడీపీ మేనిఫెస్టో పేదల సంక్షేమానికి దోహదపడుతుందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు చిట్టూరి సూర్యనారాయణ, వార్డు మెంబర్లు, బూత్ ఇన్‌ఛార్జిలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆరంభం ఘనం.. అమలు శూన్యం

- 100 పడకల ఆసుపత్రికి శంకుస్థాపనతోనే సరి
- నిడదవోలులో ప్రారంభం కాని పనులు
- నేటికీ ఖరారు కాని డ్రాయింగ్



నిడదవోలు సామాజిక ఆరోగ్య కేంద్రం

నిడదవోలు, ఏప్రిల్ 28: సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ ప్రజల సమక్షంలో ఇచ్చిన హామీ.. ఎన్నికలకు ముందు హడావుడిగా ఎమ్మెల్యే శంకుస్థాపన.. కట్టిన గోడ పగలుకొట్టి హడావుడిగా ప్రారంభించిన పనులు.. నేటికీ దానివైపు చూసిన వారే లేరు.. వివరాల్లోకి వెళితే.. నిడదవోలులో ఉన్న 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని(ప్రభుత్వాసుపత్రి) 100 పడకల ఆసుపత్రిగా స్థాయిని పెంచి పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తామన్నది సీఎం జగన్ నిడదవోలు ప్రజలకు ఇచ్చిన హామీ. దీంతో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు 100 పడకల ఏరియా ఆసుపత్రికి ఈ ఏడాది ఫిబ్రవరి 22న ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా శంకుస్థాపన చేశారు. సుమారు రూ.19 కోట్ల నాబార్డ్ నిధులతో నిర్మాణానికి కాంట్రాక్టరు ముందుకు వచ్చాడు. పనులు ప్రారంభించేందుకు ఆసుపత్రి పైఅంతస్తులో ఉన్న పిట్ట గోడను సైతం రెండు రోజులపాటు పగలుకొట్టారు. అయితే వైద్య ఆరోగ్య శాఖ అధికార్ల నుంచి నేటికి డ్రాయింగు (డిజైన్) రాకపోవడంతో పనులు ప్రారంభం కావడం లేదు. అయితే డిజైన్ రాకుండానే స్థానిక ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు శంకుస్థాపన చేసేసారు. శంకుస్థాపన చేసిన బోర్డును సైతం ఓ గదిలో భద్రపరిచారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారుల నుంచి డిజైన్ ఖరారై వస్తుందా.. తిరిగి పనులు ప్రారంభమవుతాయా, జగన్ హామీ నెరవేరేనా, 100 పడకల ప్రభుత్వాసుపత్రి ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలందేనా అంటూ ప్రజలు నిట్టూర్పులు విడుస్తున్నారు.



ఆసుపత్రిలో పనులు ప్రారంభించేందుకు పగలుకొట్టిన గోడ



వంద పడకల ఆసుపత్రికి చేసిన శంకుస్థాపన స్టాండ్

ఇద్దరిని మింగేసిన అతివేగం

- రోడ్డు ప్రమాదంలో ఇరువురి మృతి
- ఆరుగురికి స్వల్పగాయాలు
- ఆగి ఉన్న లారీని వ్యాన్ ఢీకొనడంతో ఘటన



కాపవరం హైవేపై ప్రమాద దృశ్యం



ప్రమాదంలో ధ్వంసమైన వ్యాన్ ముందుభాగం

కొవ్వూరు, ఏప్రిల్ 28: కొవ్వూరు మండలం కాపవరం హైవేపై జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. ఏలూరు శనివారపుపేటకు చెందిన తారా డేవిడ్ మరో ఏడుగురు సౌండ్ సిస్టమ్ ఆపరేటర్స్ శనివారం రాత్రి ఏలూరు నుంచి గుంటూరు వెళ్లి సౌండ్ సిస్టమ్స్ లోడ్ చేసుకుని విశాఖపట్నం పరిధిలోని చోడవరం ఐషర్ వ్యాన్‌పై బయలుదేరారు. మార్గ మధ్యలో కాపవరం హైవేపై గోవర్ధనగిరిమెట్ట ఫ్లైఓవర్ సమీపానికి చేరుకునే సరికి జగ్గయ్యపేట నుంచి సిమ్మెంటు లోడ్‌తో ఒరిస్సా వెళ్తున్న లారీ రోడ్డు మార్జిన్‌లో ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా నిలుపుదల చేశాడు. డ్రైవర్ వ్యాన్‌ను కంట్రోల్ చేయలేక ఆగివున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఏలూరుకు చెందిన మేడం వినోద్‌కుమార్(32), దారబోయిన ప్రభాకర్(21)లకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ కె.సుధాకర్, పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు, రాత్రి గస్తీ నిర్వహిస్తున్న దిశ డీఎస్పీ, రోడ్డు భద్రతా మొబైల్ సిబ్బంది, ఎన్‌హెచ్ 16 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంలో ధ్వంసమైన వాహనాలను ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. తారా డేవిడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

రాష్ట్రాభివృద్ధే అజెండా

- టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు



కొవ్వూరులో తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న అచ్చిబాబు

కొవ్వూరు, ఏప్రిల్ 28: రాష్ట్రాభివృద్ధి ప్రజా సంక్షేమమే కూటమి అజెండా అని టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు అన్నారు. కొవ్వూరులోని 1, 20, 22వ వార్డుల్లో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంటమణి రామకృష్ణారావు ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో, మహాశక్తి, సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. అచ్చిబాబు మాట్లాడుతూ వైసీపీ అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రంలో విధ్వంసం, విద్వేష పూరిత వాతావరణాన్ని సృష్టించిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడితేనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని, రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. ప్రతి గ్రామంలోను పార్టీ నాయకులంతా సమిష్టిగా కూటమి అభ్యర్థుల విజయానికి కృషిచేయాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుకు సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓటువేసి గెలిపించాలన్నారు. అలాగే స్థానిక టీడీపీ కొవ్వూరు నియోజకవర్గ కార్యాలయంలో సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు మేము సైతం మన రాష్ట్రం కోసం తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ బ్యానర్‌ను రిలీజ్ చేశారు. కార్యక్రమాల్లో మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, మారిశెట్టి వెంకటేశ్వరరావు, రాజాన శ్రీనివాస్, మడిచర్ల రామచంద్రరావు, కేవీకే రంగారావు, బర్ల శ్రీనివాస్, కౌన్సిలర్ కిలారి వెంకట లక్ష్మి, కిలారి రమణ, వరిగేటి కాంతరాజు, మద్దిపట్ల సురేష్, బూరుగుపల్లి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంకలో ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. నాయుడు హనుమంతరావు, కలిశెట్టి సన్యాసినాయుడు, కొప్పాక విజయకుమార్ పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లు టీడీపీ శ్రేణులు బాబును మళ్లీ రప్పిద్దాం నినాదంతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముప్పిడి వెంకటేశ్వరరావు సతీమణి సుజాత పాల్గొని సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, కరుటూరి సతీష్, కొఠారు అశోక్ బాబా,నేతా సాహెబ్, రామకృష్ణ, జొన్నకూటి వెంకాయమ్మ, ఊబా దుర్గ పాల్గొన్నారు.



నిడదవోలులో ప్రచారం నిర్వహిస్తున్న దుర్గేష్

పెరవలి: రాష్ట్రంలో అరాచక పాలన పోవాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషా రావు, ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం అజ్జరం, వెంకట్రాయపురం, కాపవరంలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లలో వైసీపీ రాష్ట్రాన్ని అస్తవ్యస్తంగా మార్చిందన్నారు. ఎంపీ అభ్యర్థి పురందేశ్వరిని, ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గేష్‌ను గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో ఒక వ్యక్తి టీడీపీ అధినేత చంద్రబాబు పోలికలతో ఉండి సందడి చేశారు. అభిమానులు ఆయనతో కలిసి ఫొటోలు తీసుకున్నారు. కార్యక్రమంలో జనసేన సమన్వయ కర్త భోగవల్లి ప్రసాద్, భూపతిరాజు రవివర్మ, అతికాల శ్రీను, పిప్పర రవి, అబ్బిశెట్టి సత్తిరాజు, బొడ్డు రామాంజనేయులు, నందిప శ్రీనివాసచక్రవర్తి, పోతాబత్తుల శ్రీనివాసు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులో ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్.. ఐకాన్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ డీవీ కృష్ణారావు, శేషగిని హాస్పిటల్స్ అధినేత డాక్టర్ తోపరాల కళ్యాణ్ చక్రవర్తితో కలిసి ప్రచారం నిర్వహించారు. జనసేన, టీడీపీ బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని హుకుంపేట, గోపవరం, రామపాలెం, గంగోలు, యర్రవరం, నర్సాన్నపాలెం, కాలనీలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. చంద్రబాబు ప్రజలకు అందించే పథకాలు ప్రజారంజకమైనవని, జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టోతో మరోసారి రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమవుతున్నాడన్నారు. ఈ ఎన్నికలు జగన్‌కి చివరి ఎన్నికలని వైసీపీ భూస్థాపితం అవ్వడానికి మరికొన్ని రోజులు మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జ్ సువర్ణరాజు, రొంగల సత్యనారాయణ, సర్పంచ్ డాకే గంగారాణి, హోతా రాజాబాబు, నాగేశ్వరరావు, రాజ తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజుకు మద్దతుగా మండలంలోని చీపురుగూడెంలో కూటమి సభ్యులు ప్రచారం చేశారు. రాబోయే రోజుల్లో రైతుల భూములను కాజేసే చీకటి చట్టాన్ని సీఎం జగన్ తెచ్చారన్నారు. భూమిని కొనుగోలు చేసినట్టు ఒరిజినల్ డాక్యుమెంట్లు ఇవ్వకుండా జిరాక్స్ పేపర్లు ఇస్తారని, ఈ ప్రక్రియ సోమవారం నుంచి రాష్ట్రంలోని 16 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరుగుతుందన్నారు. భూ సమస్యలపై సివిల్ కోర్టులను ఆశ్రయించే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రావూరి వెంకటరమణ, చెల్లు పెద్దరామన్న, వీరవెంకట్రావు, కుసంపూడి వెంకటేశ్వరరావు(బుజ్జి), ప్రతిపాటి రాంబాబు, తలంశెట్టి చిన్న వెంకట్రాజు, కంపన దుర్గారావు, చెల్లు నాయుడు, చెల్లు దానరావు పాల్గొన్నారు.

మే 1నుంచి పింఛన్ల పంపిణీ

- సచివాలయాలకు రావద్దు: కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మే 1 నుంచి 5వ తేదీ వరకూ సామాజిక భద్రత పింఛన్లు అందజేయడానికి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ మాధవీలత పేర్కొన్నారు. పింఛను సొమ్మును లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమచేస్తామని, బ్యాంక్ ఖాతాలు లేనివారు, దివ్యాంగులు, అనారోగ్య కారణాల వల్ల మంచానికే పరిమితమైనవారు, సైనిక కుటుంబాలు తదితర ప్రత్యేక కేటగిరీలకు ఇంటి వద్దకే పింఛను పంపిణీ ఉంటుందన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ జరుగుతుందన్నారు. పింఛన్ల కోసం ఎవరూ సచివాలయాలకు రావద్దన్నారు. మే 1న సెలవు దినం అయినప్పటికీ చెల్లింపులు జరిగేలా రాష్ట్రస్థాయి అధికారులు, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయం తీసుకున్నట్టు కలెక్టర్ వివరించారు.

హోమ్ ఓటింగ్‌కు 69 బృందాలు

- జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత



రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28: జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో హోమ్ ఓటింగ్ కోసం ప్రత్యేకంగా 69 బృందాలను ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారిణి డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. 85 ఏళ్ల నిండిన వృద్ధులు, దివ్యాంగులు వారి ఓట్లను ఇళ్ల వద్దే వేసేవిధంగా చర్యలు తీసుకున్నామన్నారు. అందుకోసం 400 మంది సిబ్బందిని నియమించామన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 85 ఏళ్ల నిండిన వృద్ధులు 8294 మంది, 40శాతం దివ్యాంగత్వం కలిగిన ఓటర్లు 19754 మంది ఉండగా వారికి ఫారం-12 పంపిణీ చేసినట్టు డీఈవో అన్నారు. అందులో 85+ కేటగిరిలో 648, పీడబ్ల్యూడీ కేటగిరిలో 658 మంది, ఫారం-12డీ అందజేసినట్టు తెలిపారు. హోం ఓటింగ్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 69 రూట్స్ ద్వారా ఆయా ఎన్నికల సిబ్బంది తొలివిడతగా మే 2న, రెండో విడతగా మే 8న క్షేత్ర స్థాయిలో పర్యటన చేయనున్నట్టు ఆమె తెలిపారు. ఈ మేరకు ఓటర్లకు ముందస్తుగా సమాచారం ఇస్తామన్నారు. ఆయా రోజుల్లో కచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అనపర్తి నియోజకవర్గ పరిధిలో 85+వారు 186 మంది, దివ్యాంగులు 222 మంది ఉన్నారు. వారికోసం హోమ్ ఓటింగ్ బృందాలు 21, సిబ్బంది 147 మందిని ఏర్పాటు చేశామన్నారు. రాజానగరం పరిధిలో 85+వారు 33 మంది, దివ్యాంగులు 67 మంది ఉన్నారని వారి కోసం హోమ్ ఓటింగ్ బృందాలు 7, సిబ్బంది 35 మంది ఏర్పాటు చేశామన్నారు. రాజమహేంద్రవరం సిటీలో 85+ వారు 142మంది, దివ్యాంగులు 65 మంది ఉన్నారని వారి కోసం హోమ్ ఓటింగ్ బృందాలు 10, సిబ్బంది 40 మంది ఏర్పాటు చేశామన్నారు. రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో 85+ వారు 51 మంది, దివ్యాంగులు 56 మంది ఉన్నారని వారి కోసం హోమ్ ఓటింగ్ బృందాలు 5, సిబ్బంది 30 మంది ఏర్పాటు చేశామన్నారు. కొవ్వూరులో 85+ వారు 66 మంది, దివ్యాంగులు 66 మంది ఉన్నారని వారి కోసం హోమ్ ఓటింగ్ బృందాలు 8, సిబ్బంది 40 మంది ఏర్పాటు చేశామన్నారు. నిడదవోలులో 85+ వారు 130 మంది, దివ్యాంగులు 145 మంది ఉన్నారని వారి కోసం హోమ్ ఓటింగ్ బృందాలు 12, సిబ్బంది 72 మందిని ఏర్పాటు చేశామన్నారు. గోపాలపురంలో 85+ 40 మంది, దివ్యాంగులు 37 మంది ఉన్నారని వారి కోసం హోమ్ ఓటింగ్ బృందాలు 6, సిబ్బంది 36 మందిని ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ చెప్పారు.

ఏపీ సెట్ పరీక్షకు 5452 మంది హాజరు



పరీక్షాకేంద్రాన్ని సందర్శిస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 28: రాజమహేంద్రవరం రీజినల్ పరిధిలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్హత పరీక్ష(ఏపీ సెట్)కు 5452 మంది అభ్యర్థులు హాజరయ్యారని, పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగిందని ఏపీ సెట్ రాజమహేంద్రవరం రీజినల్ కోఆర్డినేటర్ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలో 11కేంద్రాల్లో పరీక్ష జరిగిందని, 6854 మంది విద్యార్థులు హాజరుకావలసి ఉండగా వారిలో 1402హాజరు కాలేదని చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పరిశీలకులు, తాను పరీక్షా కేంద్రాలను పరిశీలించామన్నారు. కాగా నన్నయ వర్శిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ కళాశాల, శ్రీ కందుకూరి రాజ్యలక్ష్మీ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అసిస్టెంట్ రీజినల్ కోఆర్డినేటర్ ఎస్.లింగారెడ్డి కేంద్రాలను సందర్శించారు.

రాజానగరం: ఏపీ సెట్ పరీక్షలకు రాజానగరంలోని గైట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో 900 మంది అభ్యర్థులకు గానూ 724 మంది హాజరు కాగా 176 మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండె దయానందకుమార్ తెలిపారు. తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టిఎస్ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 750 మందికి గాను 604 మంది హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ వై.రాజశ్రీరావు తెలిపారు. 146 మంది గైర్హాజరయ్యారన్నారు. కాగా అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యాలు, ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేవిధంగా కళాశాల యాజమాన్యం పరీక్షా కేంద్రాల్లో సదుపాయాలు కల్పించినట్టు చెప్పారు.

పెన్షనర్లను మోసం చేసిన వైసీపీని ఓడించాలి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28: ప్రజలను, పెన్షనర్లను మోసం చేసిన జగన్ ప్రభుత్వాన్ని చిత్తుచిత్తుగా ఓడించాలని ఆలిండియా పెన్షనర్ల సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి జి.పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం తిలక్ రోడ్డులోని టీడీపీ ఎన్నికల కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. ఒకటో తేదీన పెన్షన్ వేయకుండా ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెన్షనర్లకు పీఆర్‌సీ, డీఏలు, జీపీఎఫ్ మెడికల్ బిల్లుల బకాయిలు రూ.30 వేల కోట్లు ఉన్నాయన్నారు. 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో, 25 ఎంపీ స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగుల సంఘం నేత విజ్జడం చౌదరి మాట్లాడుతూ ప్రశ్నించే ఉద్యోగులపై అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేసిన జగన్ రెడ్డిని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ రావాలి.. బతుకులు మారాలి..

- కాంగ్రెస్ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



అన్నపూర్ణంపేటలో ఓట్లు అభ్యర్థిస్తున్న గిడుగు, బోడా

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28: కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తేనే రాష్ట్రంలో పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజల బతుకులు మారతాయని కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. ఆదివారం సాయంత్రం రాజమహేంద్రవరం అన్నపూర్ణంపేటలో ఆయన, సిటీ అభ్యర్థి బోడా వెంకట్‌తో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు వారికి స్వాగతం పలికి అక్కడి సమస్యలను వివరించారు. రైల్వేగేటును ఆనుకుని వున్న నివాసాల మహిళలు వారికి కనీస సౌకర్యాలు లేవని గిడుగు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కారమై నగరం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి మైనార్టీలు మద్దతు ప్రకటించారు. తొలుత ఉదయం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో వాకర్స్‌ను గిడుగు, బోడా కలిసి కాంగ్రెస్ పార్టీ 9 గ్యారెంటీలపై కరపత్రాలను అందించారు. కార్యక్రమాల్లో పీసీసీ అధికార ప్రతినిధి కొవ్వూరి శ్రీనివాస్, కాటం రవి, బెజవాడ రంగా, చింతాడ వెంకటేశ్వరరావు, బత్తిన సుబ్బారావు, రౌతు విజయలక్ష్మి, శెట్టి ప్రతాప్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ సిటీగా రాజమహేంద్రవరం అభివృద్ధి

- నగరాన్ని ఐటీ హబ్‌గా మారుస్తాం
- టీడీపీ-జనసేన-బీజేపీ ఆత్మీయ సమావేశంలో ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28: రాజమహేంద్రవరాన్ని మోడల్ సిటీగా అభివృద్ధి చేస్తానని, వైసీపీ పాలకులు రాజమహేంద్రవరాన్ని గత ఐదేళ్లుగా అస్తవ్యస్తం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక నగరవైభవాన్ని ఇనుమడింపజేస్తామని టీడీపీ-జనసేన- బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం తుమ్మలావలో ఆదివారం రాత్రి టీడీపీ డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు యాళ్ల ప్రదీప్ ఆధ్వర్యంలో జరిగిన టీడీపీ-బీజేపీ-జనసేన ఆత్మీయ సమావేశంలో వాసుతోపాటు జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి తనయుడు దగ్గుబాటి హితేష్ చెంచురామ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. తొలుత అనుశ్రీ, హితేష్‌లు మాట్లాడారు. ఆదిరెడ్డి శ్రీనివాస్ అందరివాడని ప్రజలకు కష్టం అంటే ముందుంటాడన్నారు. నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారం కోసం పరితపిస్తారన్నారు. నగరంపై లోతైన అవగాహన కలిగిన ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే రాజమహేంద్రవరాన్ని సమగ్ర అభివృద్ధి చేస్తారన్నారు. ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజలను దోచుకుందన్నారు. ఐదేళ్లుగా నానా రకాలుగా ఇబ్బందులు పెట్టారన్నారు. నగరంలో 2019 వరకు లేని బ్లేడుబ్యాచ్లు ఇప్పుడెలా వచ్చాయని, కూటమి అధికారంలోకి వచ్చాక వాటిని నిర్మూలిస్తామన్నారు.